Follow: @ANNTELUGU

17-12-2024

ANN తెలుగు

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 16 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## కొత్త రేషన్ కార్డులు ఇస్తాం

- సంక్రాంతి నుండి పంపిణీ షురూ
- 36 లక్షల మందికి కొత్త కార్డులు
- మండలిలో మంత్రి ఉత్తమ్ ప్రకటన

సీనియర్ జర్నలిస్ట్ ఎస్కె జకీర్ విశ్లేషణ 4లో

అసెంబ్లీ బాట

### అయిదు రోజులు అసెంబ్లీ సమావేశాలు



- ఈ నెల 21 వరకు సమావేశాలు
- స్పీకర్ కార్యాలయం వెల్లడి

02

రియల్ మాట

### వరదలతో అమరావతి అంటే భయపడుతున్నారు



- రియల్ ఎస్టేట్ అంటే హైదరాబాద్ .. బెంగుళూరే
- హైడ్రాపై ప్రజల్లో భయంలేదు
- చిట్ చాట్ లో మంత్రి పొంగులేటి

02

వేట

### మోహన్ బాబును అందుకే అరెస్ట్ చేయలేదు



- మంచు కుటుంబంపై మూడు ఎఫ్ఐఆర్‌లు
- రాచకొండ సీపీ కీలక కామెంట్స్

02

# కేటీఆర్ విచారణకు గ్రీన్ సిగ్నల్




### ఏసీబీకి లేఖ రాయనున్న సీఎస్

- గవర్నర్ అనుమతి పత్రం జతచేస్తూ లేఖ
- అర్వింద్ కుమార్ విచారణకు అనుమతి
- ఈ కార్ రేస్‌లో స్వార్థం, స్వలాభం కోసం అక్రమాలు
- ఫార్ములా ఈ రేస్ పై కేబినెట్ లో హాట్ హాట్ చర్చ
- ఐదు ఆర్డినెన్స్ లకు మంత్రి వర్గం ఆమోదం
- నాలుగుగంటలకు పైగా చర్చించిన కేబినెట్
- వివరాలు వెల్లడించిన రాష్ట్రమంత్రి పొంగులేటి
- బాంబు తుస్సుమంటే ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు ఎందుకు చేశారు?
- అసెంబ్లీలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు గుండాల్లా ప్రవర్తించారు
- ఈ సమావేశాల్లోనే ఆర్ ఓ ఆర్ బిల్లు
- ఇందిరమ్మ పాలనలో కక్షసాధింపులు ఉండవు
- సంక్రాంతికి రైతు భరోసా.. తర్వాత కొత్త రేషన్ కార్డులు

వివరాలు 2లో

“ మాజీమంత్రి కేటీఆర్ అరెస్ట్ పై తానేమీ చెప్పలేనని, జరిగితే రేపోమాపో జరగొచ్చని రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. చట్టం తన పని తాను చేస్తుందని పేర్కొన్నారు. " ఈ-కారు రేసు విచారణకు గవర్నర్ పర్మిషన్ ఇచ్చారు. గవర్నర్ అనుమతిని సీఎస్ ఏసీబీకి పంపిస్తారు. చట్టప్రకారమే ఏసీబీ దర్యాప్తు చేస్తుంది. కేబినెట్‌లో కూడా ఈ-కారు రేసులో గవర్నర్ పర్మిషన్‌పై చర్చ జరిగింది. ఫార్ములా ఈ-రేసులో జరిగిన దోపిడీపై సుదీర్ఘంగా విచారణ జరిగింది. కేటీఆర్ అరెస్టు విషయంలో చట్టం తన పని తాను చేస్తుంది. ఇటీవల బీఆర్ఎస్ నేతలు బాంబు తుస్సుమందని వ్యాఖ్యానించారు.

**- మహా, హైదరాబాద్**



### మార్చిలోపు అరెస్టయితే..

# కేటీఆర్‌కు సీఎం యోగం

### అల్లు అర్జున్ పొలిటికల్ ఎంట్రీ ఖాయం

### జగన్ లాంటి కసి బన్నీలో ఉంది

### వేణుస్వామి తాజా జోస్యం

జైలుకు వెళ్లిన వాళ్లందరూ ముఖ్యమంత్రులు అవుతున్నారని, మార్చిలోపు అరెస్ట్ అయితే కేటీఆర్ కు కూడా సీఎం యోగం ఉంటుందని ప్రముఖ జ్యోతిష్యుడు వేణుస్వామి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏడాదికాలంగా కేటీఆర్ ఫైర్ ను అందరూ చూస్తున్నారన్నారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డికి జాతకరీత్యా తిరుగులేదన్నారు. 2025లో తెలుగు రాజకీయాలు, చిత్రపరిశ్రమ గింగిరాలు తిరుగుతుందన్నారు. ఇక సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో చర్లపల్లి జైల్లో ఒక రాత్రి గడిపిన అల్లు అర్జున్ ను ఉద్దేశించి ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. , అల్లు అర్జున్ పొలిటికల్ ఎంట్రీ ఖాయమని, భవిష్యత్తులో ఏదో ఒక రాష్ట్రానికి ఆయన సీఎం అవుతారని అన్నారు. జైలు నుంచి జగన్ ఎంతో కసిగా బయటకు వచ్చారని దానికంటే 100 రెట్లు ఫైర్ తో అల్లు అర్జున్ బయటకు వచ్చారని అన్నారు. వేణు స్వామి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

**- మహా, హైదరాబాద్**



### ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

**మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్ పరీక్షలు**

**మహా:** తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ ఎగ్జామ్స్ షెడ్యూల్ ఖరారైంది. మార్చి 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఇంటర్ ఎగ్జామ్స్ జరగనున్నాయి. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 22 వరకు ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. జనవరి 29 ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్

మిగతా 2లో



### ఈ ఘనత మీదే

- కార్యకర్తలే కాంగ్రెస్ కు అండా దండ
- జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటుదాం
- భూ బకాసురుల భరతం పట్టేందుకే హైడ్రా
- పదేళ్ళలో బీఆర్ఎస్ 50 వేల ఉద్యోగాలు ఇవ్వలేదు
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 55 వేల ఉద్యోగాలు ఇచ్చింది
- కాంగ్రెస్ పార్టీ సమీక్షా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

వివరాలు 2లో

### ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 170 | 210 | 220 |

హోల్ సేల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 190 | 230 | 250 |

### ఈరోజు గుడ్డు ధరలు

ఎన్ఈసీసీ గుడ్డు ధర ₹

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 6.20 | 186 |

హోల్ సేల్ గుడ్డు ధర ₹


| 1 పీస్ | ట్రే |
|---|---|
| 6.2 | 186 |

రిటైల్ గుడ్డు ధర ₹

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 6.7 | 200.88 |

# బీఆర్ఎస్ అంటే బకాయిల రాష్ట్ర సమితి

**శాసనసభలో సీతక్క VS హరీష్**



**హైదరాబాద్, మహా:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా జరుగుతున్నాయి. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధంతో సభా వాతావరణం సోమవారం ఉదయం ఒక్కసారిగా వేడెక్కింది. తెలంగాణలో రూ.691 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బడా కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఏడాదిగా బిల్లులు చెల్లించకుండా సర్పంచులను గోస పెడుతున్నారని విమర్శించారు. హరీష్‌వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన మంత్రి సీతక్క.. బీఆర్ఎస్ అంటేనే బకాయిల రాష్ట్ర సమితి అని ఎద్దేవా చేశారు. దీంతో సభలో కాసేపు గందరగోళం నెలకొంది. స్పీకర్ గారు రెండురోజుల ట్రైనింగ్ ఇచ్చారు ఇదేనా అంటూ హరీష్ వ్యాఖ్యానించారు.

### బీఏసీ సమావేశం నుంచి బీఆర్ఎస్, ఎంఐఎం వాకౌట్

**హైదరాబాద్, మహా:** విపక్షాల నిరసన, వాకౌట్ మధ్య అసెంబ్లీలో జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ బీఏసీ సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే అజెండాతో మధ్యాహ్నం స్పీకర్ ఛాంబర్లో భేటీ ప్రారంభమైంది. అయితే సమావేశం నుంచి బీఆర్ఎస్, ఎంఐఎం వాకౌట్ చేశాయి. ఆ పార్టీల తరపున సమావేశానికి వచ్చిన హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, అక్బరుద్దీన్ వాకౌట్ చేశారు.

మిగతా 2లో

### నాకు తెలియదా?

**బీఏసీ సమావేశంపై బీఆర్ఎస్ విమర్శలను కొట్టి పారేసిన భట్టి**



**హైదరాబాద్, మహా :** బీఏసీ సమావేశాల పై బీఆర్ఎస్ చేసిన ఆరోపణలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర స్థా.యిలో మండిపడ్డారు. అసెంబ్లీ నిబంధనల మేరకే బీఏసీ సమావేశం

మిగతా 2లో

# జమిలి ఎన్నికల బిల్లులో కొత్త ట్విస్ట్

**లోక్‌సభతో సంబంధం లేకుండానే అసెంబ్లీ ఎలక్షన్స్**

నేడు సభ ముందుకు బిల్లు




వివరాలు 2లో

# కేటీఆర్ విచారణకు గ్రీన్ సిగ్నల్




**హైదరాబాద్, మహా:** మాజీమంత్రి కేటీఆర్ అరెస్ట్ పై తానేమీ చెప్పలేనని, జరిగితే రేపోమాపో జరగొచ్చని రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. చట్టం తన పని తాను చేస్తుందని పేర్కొన్నారు. '' ఈకారు రేసు విచారణకు గవర్నర్ పర్మిషన్ ఇచ్చారు. గవర్నర్ అనుమతిని సీఎస్ ఏసీబీకి పంపిస్తారు. చట్టప్రకారమే ఏసీబీ దర్యాప్తు చేస్తుంది. కేబినెట్ లో కూడా ఈకారు రేసులో గవర్నర్ పర్మిషన్‌పై చర్చ జరిగింది. ఫార్ములా ఈరేసు లో జరిగిన దోపిడీపై సుదీర్ఘంగా విచారణ జరిగింది. కేటీఆర్ అరెస్టు విషయంలో చట్టం తన పని తాను చేస్తుంది. ఇటీవల బీఆర్ఎస్ నేతలు బాంబు తుస్సు మందని వ్యాఖ్యానించారు.

అది తుస్సుమంటే ఢిల్లీ చుట్టూ ఎందుకు ప్రదక్షిణలు చేస్తున్నారు. అసెంబ్లీలో కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గుండాల్లా ప్రవర్తించారు. మాట్లాడటానికి ఏ విషయాలు లేనందువల్లే ప్లకార్డులు, నినాదాలతో అసెంబ్లీ సమావేశాలకు ఆటంకం కలిగించారు. ఈ సమావేశాల్లోనే ఆర్వోఆర్ బిల్లు ప్రవేశపెడతాం. ఇందిరమ్మ పాలనలో కక్ష సాధింపు చర్యలు ఉండవు. అవినీతిని ప్రజల ముందు బయటపెడతామని'' పొంగులేటి అన్నారు. ఫార్ములా ఈ కార్ రేస్ లో ఐఏఎస్ అరవింద్ కుమార్ కూడా ఉండగా, అరవింద్ కుమార్ విచారణకు ప్రభుత్వం క్లియరెన్స్ ఇచ్చింది. ఓఆర్ఆర్ పరిధిలోని 51 గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీల్లో విలీనానికి ఆమోదం తెలిపారు. రైతు భరోసాపై కేబినెట్ భేటీలో చర్చ జరిగింది. సంక్రాంతి నుంచి రైతు భరోసా అమలు చేయాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. సంక్రాంతి తర్వాత కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు.

### చట్టప్రకారమే దర్యాప్తు

ఈకార్ రేసు వ్యవహారంలో చట్టప్రకారమే దర్యాప్తు కొనసాగుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కేటీఆర్‌ను విచారించేందుకు ఇప్పటికే అనుమతి లభించిందని, గవర్నర్ అనుమతి ఇస్తూ జారీ చేసిన దస్త్రాన్ని ఇవాళ రాత్రి, లేదా మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) ఏసీబీకి(అవినీతి నిరోధక శాఖ)కు పంపిస్తారని చెప్పారు. చట్టప్రకారం అవినీతి నిరోధక శాఖ దర్యాప్తు కొనసాగుతుందని పొంగులేటి తెలిపారు. కేటీఆర్ అరెస్ట్ విషయంలో తొందరపడవద్దని, గవర్నర్ అనుమతి నేపథ్యంలోనే విచారణ జరుగుతుందని, కేసు తీవ్రత ఆధారంగా చట్టానికి లోబడి ఎంతపెద్దవారైనా విచారించాల్సిందేనని ఈ సందర్భంగా నిర్ణయించారు.

# కొత్త రేషన్ కార్డులు ఇస్తాం

- సంక్రాంతి నుండి పంపిణీ షురూ
- 36 లక్షల మందికి కొత్త కార్డులు
- మండలిలో మంత్రి ఉత్తమ్ ప్రకటన



**హైదరాబాద్,మహా:** అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మండలిలో సభ్యుడు అడిగిన ప్రశ్నకు మంత్రి ఉత్తమ్ బదులిచ్చారు. ఈ ప్రక్రియ త్వరలోనే చేపడుతామని.. సంక్రాంతి నుంచి రేషన్ కార్డుల మంజూరీ ఉంటుందని చెప్పారు. ఇప్పటికే రేషన్ కార్డుల మంజూరు విషయంపై క్యాబినెట్ సబ్ కమిటీ వేసినట్లు గుర్తుచేశారు. దాదాపు తెలంగాణ వ్యాప్తంగా 36 లక్షల మందికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేసే ఆలోచనలో ఉన్నట్లు వెల్లడించారు. కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వటమే కాకుండా సన్నబియ్యం కూడా ఇస్తామని మంత్రి ఉత్తమ్ మండలి వేదికగా ప్రకటించారు. రేషన్ కార్డుల మంజూరుపై శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కీలక సూచనలు చేశారు. అవసరం ఉన్నవారికి మాత్రమే రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. అసలైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కొందరు అనర్హులు కూడా రేషన్ కార్డులు పొంది ప్రభుత్వ ఆదాయానికి గండిపెడుతున్నారని అన్నారు. సివిల్ సప్లయ్ అధికారులు సమగ్ర విచారణ జరిపి అవసరం లేని వారి కార్డులను తొలగించాలన్నారు. పేదరికం అనుభవిస్తున్న వారికి మాత్రమే ప్రభుత్వం సరుకులు పంపిణీ చేయాలని మండలి ఛైర్మన్ గుత్తా ప్రభుత్వానికి సూచించారు. కాగా, ప్రస్తుతం తెలంగాణలో 89.96 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి అదనంగా మరో 36 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు విడివిడిగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ఇది వరకే ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా రేషన్ కార్డుల మంజూరుపై మంత్రి ఉత్తమ్ అసెంబ్లీ వేదికగా ప్రకటన చేయటంతో అర్హులైన వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




# అయిదు రోజులు అసెంబ్లీ సమావేశాలు

### స్పీకర్ కార్యాలయం వెల్లడి

**హైదరాబాద్, మహా :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలను మరో ఐదు రోజులపాటు నిర్వహించాలని శాసనసభా స్పీకర్ గడ్డం ప్రసాద్ నిర్ణయించారు. బీఏసీ సమావేశం అనంతరం ఈనెల 21 వరకూ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నట్లు స్పీకర్ కార్యాలయ ప్రకటించింది. సోమవారం శాసనసభ సమావేశాలు వాయిదా పడ్డ అనంతరం అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశమైంది. ఈ సమావేశంలో అదానీ, రేవంత్ రెడ్డి ఉన్న టీషర్ట్స్ గురించి కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. టీషర్ట్స్ వేసుకుని వస్తే తప్పేంటని బీఆర్ఎస్ సభ్యులు ప్రశ్నించారు. పార్లమెంట్‌కు రాహుల్ గాంధీ టీషర్ట్స్ వేసుకుని వెళ్లడం లేదా అంటూ హరీశ్ రావు ప్రశ్నించారు. అనంతరం సమావేశం నుంచి బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు వాకౌట్ చేశాయి. సభా పనిదినాలు, సబ్జెక్ట్‌పై క్లారిటీ ఇవ్వనందుకే వాకౌట్ చేసినట్లు ఆ పార్టీల నేతలు తెలిపారు.

# వరదలతో అమరావతి అంటే భయపడుతున్నారు



**మహా:** ఆంధ్రప్రదేశ్‌లో సీఎంగా చంద్రబాబు రాగానే.. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పూర్తిగా పడిపోయిందని.. అమరావతికే పెట్టుబడులన్నీ వెళ్తున్నాయని.. రియల్ ఎస్టేట్ రంగం అమరావతికి వెళ్తుందంటూ జరుగుతున్న ప్రచారంపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. మీడియాతో చిట్ చాట్‌లో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. చంద్రబాబు రాగానే రియల్ ఎస్టేట్ అమరావతికి పోతుందనేది కేవలం ప్రచారం మాత్రమేనని క్లారిటీ ఇచ్చారు.

ఏపీలో చంద్రబాబు రాగానే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోయిందనేది తప్పుడు ప్రచారమని కొట్టిపడేశారు. చంద్రబాబు వచ్చిన తర్వాత ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఇన్వెస్టర్లు భయపడుతున్నారని కీలక వ్యాఖ్యలు చేశారు. అమరావతిలో వరదల కారణంగా ఏపీకి పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదని చెప్పుకొచ్చారు. వరదల వల్ల పెట్టుబడులు పెట్టే వారికి భయం పట్టుకుందన్నారు. అమరావతి కంటే.. హైదరాబాద్, బెంగుళూరు నగరాల్లోనే పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ప్రాధాన్యత ఇస్తున్నాయని పేర్కొన్నారు. హైడ్రా భయం ప్రజల్లో ఏమాత్రం లేదని.. మొదట్లో తప్పుడు ప్రచారం జరిగినా.. ప్రజలకు ఇప్పుడు నిజం తెలిసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అప్పులపై కేటీఆర్, బీఆర్ఎస్ నిజాలు తెలుసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ నాయకులు కార్పొరేషన్ లోన్స్‌తో కలిపి మొత్తం లెక్కలు బయటపెట్టాలని మంత్రి డిమాండ్ చేశారు. కార్పొరేషన్ పేరుతో చేసే అప్పులు కూడా ప్రభుత్వ ఖాతాలోకే వస్తాయనేది కేటీఆర్ తెలుసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రానికి 7 లక్షల 20 వేల కోట్ల అప్పులన్నాయని మంత్రి వివరించారు. శాసనసభలో ఎవరి పాత్ర వారిదేనని.. ప్రివిలేజ్ మోషన్ ఇవ్వడమనేది ప్రతిపక్షాల హక్కు అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా కొసరుతో కొట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఆయనతో వ్యక్తిగతంగా కూర్చొని మాట్లాడాలనే కోరిక ఉన్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు.

# ఈ ఘనత మీదే

### కార్యకర్తలే కాంగ్రెస్ కు అండా దండ

- జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటుదాం
- భూ బకాసురుల భరతం పట్టేందుకే హైడ్రా
- పదేళ్ళలో బీఆర్ఎస్ 50 వేల ఉద్యోగాలు ఇవ్వలేదు
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 55 వేల ఉద్యోగాలు ఇచ్చింది
- కాంగ్రెస్ పార్టీ సమీక్షా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, మహా :** కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వాన్ని తెలంగాణ గ్రామీణ ప్రాంత ప్రజలుగుండెల్లో పెట్టుకుని కాపాడుతున్నారని టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం సోమవారం గాంధీ భవన్ లో జరిగింది. కార్యకర్తల కృషి వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఈ ఘనత కార్యకర్తలకే దక్కుతుందన్నారు. తెలంగాణ గ్రామీణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని గుండెల్లో పెట్టుకున్నారని పేర్కొంటూ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పాటు లోక్ సభ ఎన్నికల ఫలితాలను కార్యకర్తలకు వివరించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలవడమే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ముందున్న టార్గెట్ అని పేర్కొన్నారు. జీహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకు రావాలని, హైదరాబాద్ అభివృద్ధి జరిగిందంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీ వల్లేనని అన్నారు. ఓఆర్ఆర్, మెట్రో రైల్, అంతర్జాతీయ. విమానాశ్రయం లాంటి వాటికి శ్రీకారం చుట్టింది కాంగ్రెస్ పార్టీ అని వివరించారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఫ్లై ఓవర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అని మహేష్ కుమార్ గౌడ్ వివరించారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ ను అంతర్జాతీయ నగరంగా తీర్చి దిద్దాలంటే కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్న విషయాన్ని గ్రేటర్ వాసులకు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. గ్రేటర్ ను కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇప్పటచి నుంచే కార్యరంగంలోకి దిగాలని పిలుపునిచ్చారు.

పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో భూ బాకసురులు రెచ్చిపోయారని, వందల చెరువులు కబ్జాకు గురయ్యాయన్నారు. భూ బకాసురుల భరతం ఫట్టందుకు రేవంత్ రెడ్డి ప్రభుకత్వం హైడ్రాను తీసుకు వచ్చిందన్నారు. హైడ్రా ఏర్పాటుతో బీఆర్ఎస్ నేతలు బెంబేలెత్తిపోయి ప్రజల్లో భయభ్రాంతులను రేకెత్తించేందుకు శత విధాలా ప్రయత్నించారని విరుచుకుపడ్డారు. 2014లో అధికారంలోకి రాగానే ఏదో ప్రజలకు మేలు చేస్తామన్న రీతిలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారని, ప్రపంచంలోని ఏ దేశంలో ఉన్న వారైనా తెలంగాణకు వచ్చి స్వయంగా వివరాలను నమోదు చేసుకోవాలని లేకపోతే పౌరులుగా గుర్తించమని భయభ్రాంతులకు గురి చేసి నిర్వహించిన సర్వే వివరాలను ఎందుకు ప్రజల ముందుంచలేదని నిలదీశారు. అసలా సర్వే రిపోర్టు ఏమైందని ప్రశ్నించారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జీహెచ్ఎంసీ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ఆశాజనకంగా సీట్లు రాలేదన్న మహేష్ కుమార్ గౌడ్ గ్రేటర్ కార్యకర్తలు ఈ విషయాన్ని గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కులం, మతం పేరుతో ఉద్రేకాలు రెచ్చగొట్టి ఇతర పార్టీలు సీట్లు గెలుచుకున్నాయన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, కాంగ్రెస్ ఏడాది పాలన కు చాలా వ్యత్యాసం ఉందని, ఈ వ్యత్యాసాన్ని కార్యకర్తలు ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్ళాలని కోరారు. బీఆర్ఎస్ పదేళ్లలో 50 వేల ఉద్యోగాలు ఇవ్వలేకపోయిందని, ఉద్యోగాల ఆశతో పదేళ్ళూ నిరుద్యోగులను మోసపుచ్చిందని విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ 9 నెలల్లోనే 55 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిందని, చెప్పిన ప్రకారం ఉద్యోగ నోటిఫికేషన్లు వేస్తూ ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీల భర్తీతో పాటు బారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించి ప్రైవేట్ రంగంలోనూ ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. పేదలకు గృహ నిర్మాణంతో పాటు మహిళలకు ఆర్థిక స్వావ లంభన కల్పించేందుకు పలు పథకాలను కూడా ప్రోత్సహిస్తున్నామన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక నిర్ణయాలను తీసుకుందని, యువతలో ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రత్యేక యూనివర్సిటీని ఏర్పాటు చేయడంతో పాటు ఐటీఐలను స్కిల్ డవలప్ మెంట్ సెంటర్లుగా మార్చాలని సంకల్పంచారన్నారు.

# మోహన్ బాబును అందుకే అరెస్ట్ చేయలేదు

### మంచు కుటుంబంపై మూడు ఎఫ్ఐఆర్‌లు

### రాచకొండ సీపీ కీలక కామెంట్స్

**హైదరాబాద్, మహా:** మంచు కుటుంబంపై మొత్తం మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు వెల్లడించారు. తాజాగా.. మంచు ఫ్యామిలీపై కేసులు, మీడియా ప్రతినిధిపై మోహన్ బాబు దాడి ఘటనపై సీపీ కీలక కామెంట్స్ చేశారు. డిసెంబర్ 10న జల్‌పల్లిలోని మోహన్ బాబు నివాసం వద్ద మీడియా ప్రతినిధిపై దాడి ఘటనపై ఆయనపై హత్యాయత్నం కేసు నమోదైందని చెప్పారు. ఈ నేపథ్యంలో మోహన్‌బాబుపై వారెంట్ ఇష్యూ చేసినట్లు తెలిపారు. కాగా, విచారణకు హాజరయ్యేందుకు మోహన్ బాబు ఈనెల 24న వరకు టైం అడిగినట్లు తెలిపారు. కోర్టు నుంచి ఆయన పర్మిషన్ తెచ్చుకున్నట్లు సీపీ వెల్లడించారు. అందుకే ఈ కేసులో ఆయన్ను అరెస్టు చేయలేదని అన్నారు. ఈనెల 24 తర్వాత ఆయనకు మరోసారి నోటీసులు ఇస్తామన్నారు. అప్పుడు ఆయన విచారణకు రావాల్సి ఉంటుందని తెలిపారు. లేదంటే వారెంట్ ఇష్యూ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మంచు మనోజ్, విష్ణు, మోహన్ బాబులపై నమోదైన కేసుల్లో దర్యాప్తు చేస్తున్నామని.. లీగల్‌గా ప్రొసీడ్ అవుతామని అన్నారు.

# నాకు తెలియదా?

(మొదటిపేజీ తరువాయి)

జరిగిందన్నారు. బీఏసీ సమావేశంలో బీఆర్ఎస్ వ్యవహరించిన తీరు సరిగ్గా లేదంటూ భట్టి విరుచుకుపడ్డారు. అసెంబ్లీ ఎన్ని రోజులు నడుపాలన్నది స్పీకర్ నిర్ణయిస్తారని, పదేళ్లు పాలించిన వారికి ఈ విషయం తెలియదా? అంటూ ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు చెప్పినట్లే సభా పనిదినాలు ఉండాలంటే ఎలా అని డిప్యూటీ సీఎం అసహనం వ్యక్తం చేశారు. తాను ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో తెలియదా? అంటూ ధ్వజమెత్తారు. ఇప్పుడు కూడా సభ ఎన్ని రోజులు జరపాలో స్పీకరే నిర్ణయిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడైనా బీఏసీ సమావేశం జరిగినపుడు ప్రతిపక్ష పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారా అని ప్రశ్నించారు., అధికారంలో ఉన్నప్పుడు, అధికారం కోల్పోయాక ఒకే రకంగా ఉండాలంటే ఎలా కుదురుతుందని భట్టి నిలదీశారు. స్పీకర్ ను ఆదేశిస్తాం, సభను కట్టడి చేస్తామన్న బీఆర్ఎస్ వైఖరి ఏ మాత్రం సహించేది లేదని తేల్చి చెప్పారు.

# జమిలి ఎన్నికల బిల్లులో కొత్త ట్విస్ట్

### లోక్‌సభతో సంబంధం లేకుండానే అసెంబ్లీ ఎలక్షన్స్.. నేడు సభ ముందుకు బిల్లు




**ఢిల్లీ, మహా:** 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' కోసం ప్రవేశపెట్టే బిల్లులు లోక్ సభ ముందుకు మంగళవారం రానున్నాయి. అయితే జమిలి ఎన్నికల కోసం ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లులో లోక్‌సభతో పాటు అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితులకు సంబంధించిన నిబంధన ఒకటి ఉంది.

**129వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం**

సెక్షన్ 2 సబ్ క్లాజ్ 5 ప్రకారం లోక్‌సభతో పాటు ఏదైనా శాసనసభకు ఎన్నికలు నిర్వహించలేమని ఈసీ అభిప్రాయపడితే తర్వాత అసెంబ్లీలకు ఎన్నికలు జరపవచ్చు. శాసనసభ ఎన్నికలకు ఉత్తర్వులు ఇవ్వాలని ఈసీ రాష్ట్రపతికి సిఫార్సు చేయాలి. ఈ క్రమంలో రాష్ట్రపతి అసెంబ్లీ ఎన్నికల కోసం ఉత్తర్వులు జారీ చేయాలి.

**సవరించాల్సిన అధికరణలు**

అలాగే లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు జమిలి ఎన్నికల అమలు కోసం రాజ్యాంగంలో కొత్తగా 82ఎ అధికరణాన్ని చేర్చాల్సి ఉంటుంది. పార్లమెంటు పదవీ కాలంలో మార్పు కోసం అధికరణం 83, అసెంబ్లీల పదవీ కాలం సవరణకు అధికరణం 172, ఎన్నికల నిబంధనల రూపకల్పన కోసం పార్లమెంటుకు అధికారం కల్పించే అధికరణం 327 సవరించాల్సి ఉంటుంది. అలాగే సార్వత్రిక ఎన్నికలు తర్వాత లోక్‌సభ మొదటి సమావేశం జరిగే తేదీపై రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేయాలి. ఆ నోటిఫికేషన్ తేదీని అపాయింటెడ్ డేట్ అంటారు. ఆ నిర్ణీత తేదీ నుంచి లోక్‌సభ పదవీకాలం ఐదేళ్లు ఉంటుంది.

**డిసెంబర్ 17న లోక్‌సభ ముందుకు**

'ఒకే దేశంఒకే ఎన్నిక' కు సంబంధించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా మరో బిల్లును కేంద్రం మంగళవారం లోక్ సభలో ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు ప్రభుత్వ అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం దీన్ని ఉభయసభల సంయుక్త కమిటీకి పంపించాలని కేంద్రం సిఫార్సు చేసే అవకాశాలున్నట్లు వెల్లడించాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ మంగళవారం ఈ బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు సదరు వర్గాలు తెలిపాయి.

**జేపీసీకి జమిలి బిల్లులు**

జమిలి ఎన్నికల నిర్వహణపై అనేక అనుమానాలు నెలకొన్నవేళ దీనిపై విస్తృత సంప్రదింపుల కోసం బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపించాలని స్పీకర్ ఓం బిర్లాను కేంద్రమంత్రి అభ్యర్థించనున్నారు. అనంతరం దీనిపై ప్యానెల్ కమిటీ ఏర్పాటుకు సభ్యులను ప్రతిపాదించాలని సభాపతి పార్టీలను కోరనున్నారు. సాయంత్రానికి కమిటీ సభ్యులను ప్రకటించే అవకాశం ఉంది.

**సంఖ్యాపరంగా కమిటీలో చోటు**

పార్లమెంట్లో పార్టీల సంఖ్యాబలం ఆధారంగా కమిటీలో వారికి చోటు దక్కుతుంది. అంటే అతిపెద్ద పార్టీ అయిన బీజేపీ నుంచి ఒక ఎంపీ కమిటీ ఛైర్మన్‌గా ఉంటారు. తొలుత ఈ ప్రతిపాదిత కమిటీకి 90 రోజుల సమయం కేటాయిస్తారు. అవసరాన్ని బట్టి ఆ తర్వాత దాన్ని పొడిగించొచ్చు.

# బీఏసీ సమావేశం నుంచి బీఆర్ఎస్, ఎంఐఎం వాకౌట్

(మొదటిపేజీ తరువాయి)

బీఏసీ లేకుండానే 2 బిల్లులు, చర్చ పెట్టడం సంప్రదాయ విరుద్ధమని హరీశ్ రావు మండిపడ్డారు. బయటకు వచ్చిన తరువాత హరీశ్ రావు ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. బీఏసీ లేకుండానే 2 బిల్లులు ప్రవేశపెట్టి, చర్చ పెట్టడం సంప్రదాయ విరుద్ధమని, కనీసం బీఏసీ మీటింగ్లో ఎన్ని రోజులు సభ నడుపుతారో కూడా స్పష్టంగా చెప్పడం లేదన్నారు. సభ కనీసం 15 రోజులు నడపాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాత్రం 3, 4 రోజులు సభ నడుపుతామని చెబుతోందని ఇలా అయితే ప్రజా సమస్యలపై చర్చ ఎలా సాధ్యమని ప్రశ్నించారు.అసెంబ్లీలో ప్రభుత్వ ఆంక్షలపై కూడా హరీశ్ రావు మండిపడ్డారు. తొలిరోజు టీ షర్టులతో వస్తే ఎందుకు ఆపారని మీటింగ్లో నిలదీశామని హరీశ్‌రావు తెలిపారు. టీషర్టుతో పార్లమెంటుకు రాహుల్ వెళ్లట్లేదా అని ప్రశ్నించారు. లగచర్ల రైతులకు బేడీలపై చర్చించాలంటే స్పందించట్లేదన్నారు. సభలో పర్యాటకం కంటే లగచర్ల రైతులపై చర్చే ముఖ్యమని చెప్పామన్నారు. ప్రతి రోజూ జీరో అవర్ ఉండాలని కోరినట్లు హరీశ్‌రావు తెలిపారు.

# ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

### మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్ పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

పరీక్ష జరగనుంది.

**మొదటి సంవత్సరం పరీక్ష తేదీలు ఇవీ..**

050325: సెకండ్ లాంగ్వేజ్ పేపర్ 1
070325: ఇంగ్లిష్ పేపర్ 1
110325: గణితం పేపర్ 1ఏ, బోటనీ పేపర్ 1, పొలిటికల్ సైన్స్ పేపర్ 1
130325: గణితం పేపర్ 2బీ జువాలజీ పేపర్ 1, హిస్టరీ పేపర్ 1
170325: ఫిజిక్స్ పేపర్ 1, ఎకనమిక్స్ పేపర్ 1
190325: కెమిస్ట్రీ పేపర్ 1, కామర్స్ పేపర్ 1
210324: పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ 1, బ్రిడ్జి కోర్సు గణితం పేపర్ 1 (బైపీసీ విద్యార్థులకు)
240325: మోడ్రన్ లాంగ్వేజెస్ పేపర్ 1, జాగ్రఫీ పేపర్ 1

**ఇంటర్ రెండో సంవత్సరం పరీక్ష తేదీలు**

060325: సెకెండ్ లాంగ్వేజ్ పేపర్ 2
100325: ఇంగ్లిష్ పేపర్ 2
120325: గణితం పేపర్ 2ఏ, బోటనీ పేపర్ 2, పొలిటికల్ సైన్స్ పేపర్ 2
150325: గణితం పేపర్ 2బీ, జువాలజీ పేపర్ 2, హిస్టరీ పేపర్ 2
180325: ఫిజిక్స్ పేపర్



2, ఎకనామిక్స్ పేపర్ 2
200325: కెమిస్ట్రీ పేపర్ 2, కామర్స్ పేపర్ 2
220325: పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ 2, బ్రిడ్జ్ కోర్సు గణితం పేపర్ 2 (బైపీసీ విద్యార్థులకు)
250325: మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్ 2, జాగ్రఫీ పేపర్ 2

# తెలంగాణ తల్లి తొలి విగ్రహం పెట్టింది మేము

## ఆ హక్కు బీఆర్ఎస్ పార్టీకి ఎక్కడున్నది.. మాజీ ఎంపీ విజయశాంతి

**హైదరాబాద్, మహా :** తెలంగాణ తల్లి విగ్రహంపై రాజకీయ దుమారం రేగుతోంది. ఈనెల 9 న సీఎం రేవంత్ సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఉద్యమ సమయంలో ఉన్న విగ్రహానికి భిన్నంగా కొత్త విగ్రహం తయారు చేయించారు. అయితే కొత్త విగ్రహం అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. గతంలో ఉన్న విగ్రహం కేసీఆర్ కూతురు కవిత రూపంలో ఉందని విమర్శిస్తుండగా.. కొత్త విగ్రహం కాంగ్రెస్ తల్లి విగ్రహం అని బీఆర్ఎస్ నేతలు ప్రతి విమర్శలు చేస్తున్నారు. ప్రతి గ్రామంలో ఉద్యమ సమయంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాలు ఏర్పాటు చేస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత విజయశాంతి స్పందించారు. తెలంగాణ తల్లి రూపం, మార్పుపై కొట్లాడే హక్కు బీఆర్ఎస్ పార్టీకి లేదన్నారు. తెలంగాణ తల్లి మొదటి విగ్రహాన్ని ఆవిష్కరించింది తామేనన్నారు. తల్లి తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో 2007లో విగ్రహాన్ని ఆవిష్కరించినట్లు ట్విట్టర్



వేదికగా వెల్లడించారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నా విగ్రహానికి అధికారిక హోదా, గౌరవం ఇవ్వలేదన్నారు. '2007 సంవత్సరంలో మొదటి తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ జరిగిందని, తల్లి తెలంగాణ పార్టీ కార్యాచరణలో భాగంగా బడుగు, బలహీన, సబ్బండ వర్గాల తల్లి ప్రతిరూపంగా బీఎస్ రాములు గారి ఆధ్వర్యంలో విగ్రహం రూపుదిద్దుకుందని తెలిపారు. అప్పటికి నాటి టీఆర్ఎస్, నేటి బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన బహుశా జరగలేదన్నారు. తదనంతరం టీఆర్ఎస్ (బీఆర్ఎస్) వారి టీఆర్ఎస్ ఆఫీస్‌లో ఒక తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ చేశారు, కానీ వారు అధికారంలో ఉన్న 10 ఏళ్ళలో ఎన్నడూ నాటి సీఎం కేసీఆర్ తెలంగాణ తల్లి రూపానికి ఒక అధికార పూర్వక హోదా, గౌరవం, ప్రభుత్వ నిర్దేశ విధానాలు కల్పించలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ వంటి రాజకీయ పార్టీ ఆవిష్కరించిన తెలంగాణ తల్లి రూపం మార్పుపై ఆ పార్టీ కొట్లాడితే ఆ హక్కు వారికి ఎక్కడున్నదని ప్రశఅనించారు. తల్లి తెలంగాణ విగ్రహ రూపాన్ని బీఆర్ఎస్ మార్చిందని నాటి మన తెలంగాణ ఉద్యమకారులు కూడా కొట్లాడ వచ్చున్నారు. మన బోనాలు, బతుకమ్మ సంస్కృతి తరతరాలుగా నిలిచే ఉన్నవి, ఉంటవి. అందుకు రాజకీయ పార్టీల ప్రయోజనార్థం ప్రమేయం ఎన్నడు ఒక ఆవశ్యకత కాదు. పానమెత్తుగా ప్రజలు కాపాడుకుంటూనే బతుకుతారు, బతికించుకుంటారు. జై తెలంగాణ అని విజయశాంతి ట్వీట్ చేశారు.

# పాలస్తీనా బ్యాగ్‌తో ప్రియాంకగాంధీ

**సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కాంగ్రెస్ అధికార ప్రతినిధి**

**పార్లమెంట్ ఆవరణలో పాలస్తీనా అనుకూల బ్యాగ్‌తో ప్రియాంక**

**వార్తల్లో నిలిచేందుకు ఇలా చేస్తుంటారని బీజేపీ నేత విమర్శ**



**న్యూఢిల్లీ, మహా :** వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ సోమవారం పాలస్తీనా అని రాసి ఉన్న బ్యాగ్‌తో లోక్ సభకు హాజరయ్యారు. పాలస్తీనా సంఘీభావానికి చిహ్నంగా భావించే పుచ్చకాయ, శాంతి చిహ్నాలు ఆ బ్యాగ్‌పై ఉన్నాయి. పార్లమెంట్ ఆవరణలో ప్రియాంక గాంధీ ఆ బ్యాగ్‌తో దిగిన ఫొటో నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ఫొటోను కాంగ్రెస్ అధికార ప్రతినిధి షామా మహమ్మద్ సోషల్ మీడియా వేదికపై పోస్ట్ చేశారు. ప్రియాంక గాంధీ తీసుకెళ్లిన ప్రత్యేక బ్యాగ్ పాలస్తీనాకు ఆమె మద్దతు, సంఘీభావాన్ని చూపుతోందని, కరుణ, న్యాయం, మానవత్వం పట్ల నిబద్ధతకు ఇది చిహ్నం అని షామా పేర్కొన్నారు. తద్వారా జెనీవా ఒప్పందాన్ని ఎవరూ ఉల్లంఘించలేరని ఆమె స్పష్టం చేశారని రాసుకొచ్చారు. ప్రియాంక గాంధీ ఆ బ్యాగ్‌తో కనిపించడంపై బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. వార్తల్లో నిలిచేందుకు కొందరు ఇలాంటి పనులు చేస్తుంటారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినప్పుడు, వారు అలాంటి చర్యలను ఆశ్రయిస్తారని విమర్శించారు. గాంధీ కుటుంబం ఎప్పుడూ బుజ్జగింపుల సంచిని మోస్తుంటుందని బీజేపీ నేత సంబిత్ పాత్ర విమర్శించారు. ఎన్నికల్లో వారి ఓటమికి బుజ్జగింపుల సంచే కారణమని చురక అంటించారు.

# ఈ రాష్ట్రం రేవంత్ అయ్య జాగీరా

**భూములు ఇవ్వమంటే రైతులను జైల్లో పెట్టేందుకు రేవంత్ ఎవరు**

**లగచర్ల ఘటనపై చర్చ పెట్టమంటే ప్రభుత్వం పారిపోయింది**

**ఎంతవరకైనా వెళ్తాం, తెగించి కొట్లాడుతాం**

**మాజీ మంత్రి కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు**

**హైదరాబాద్, మహా :** ఢిల్లీకి వందసార్లు పోయినా వంద పైసలు కూడా రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం తేలేకపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తనపై ఎవరు మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి వారిని జైళ్లల్లో పెడుతున్నారని కేటీఆర్ ఆగ్రహించారు. 35 రోజులుగా కొండగల్ రైతులు జైలులోనే మగ్గుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డిపై సోషల్ మీడియాలో పోస్టులు పెడితే వారినీ వదిలిపెట్టడం లేదని ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాలు వాయిదా అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల తమ రైడర్ షిప్ తగ్గిందని ఎల్ అండ్ టీ వంటి అంతర్జాతీయ సంస్థ సీఎఫ్ఓ ఒక్కమాట అంటే ఆయన్నీ జైల్లో పెడతాననే నియంతృత్వ ధోరణిలో ముఖ్యమంత్రి వెళ్తున్నారని కేటీఆర్ ఆగ్రహించారు. సంగారెడ్డి జైల్లో ఉన్న కొడంగల్ రైతులు, అలాగే చర్లపల్లి జైల్లో ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి విషయంలో న్యాయ పోరాటం కొనసాగిస్తామని చెప్పుకొచ్చారు. తెలంగాణ గడ్డ సీఎం రేవంత్ రెడ్డి అయ్య జాగీరా? అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భూములు ఇవ్వబోమని చెప్పిన రైతులను జైల్లో పెట్టేందుకు అసలు రేవంత్ రెడ్డి ఎవరంటూ కేటీఆర్ ప్రశ్నించారు. నియంత, చక్రవర్తి, రారాజులా రేవంత్ రెడ్డి అనుకుంటున్నారని, అలాగే పాలన చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ అత్యున్నత సభ అయిన శాసనసభలో కొడంగల్ రైతుల గురించి చర్చ పెట్టమంటే రేవంత్ పారిపోయారని కేటీఆర్ ఎద్దేవా చేశారు.



ఎంతవరకైనా వెళ్తాం

సీఎం రేవంత్ రెడ్డి ఎన్ని కుయుక్తులు పన్నినా తెలంగాణ రైతుల కోసం పోరాటం చేస్తూనే ఉంటామని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి దోస్తు అదానీ టీ షర్టులు వేసుకుని వస్తే మొన్న తమను అసెంబ్లీలోకి అగుడుపెట్టనీయలేదని మండిపడ్డారు కేటీఆర్. లగచర్ల రైతులు, గిరిజన ఆడబిడ్డలపై అర్ధరాత్రి దాడులు చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. వారిపై వేధింపుల గురించి చర్చించాలని పట్టుపడితే నేడు సభను వాయిదా వేసి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి పారిపోయారని కేటీఆర్ మండిపడ్డారు. లగచర్ల రైతుల తరపున బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉన్నారని, తామంతా వారి వెంటే ఉండి పోరాటం చేస్తామని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పారు. ఎంతవరకైనా తెగించి కొట్లాడుతామని, ప్రభుత్వ దమనకాండను ఏ మాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు.

# తెలంగాణలో కులగణన చారిత్రాత్మకం

**దశాబ్దాల బహుజనుల కల సాకారమవుతున్న వేళ**

**42 శాతం అమలు బాధ్యత ప్రభుత్వాలదే**

**బిసి ల పట్ల మార్క్ చూపబోతున్న సీఎం రేవంత్ రెడ్డి**

**వరంగల్, డిసెంబర్ 16, మహా:** తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కులగణన, కుటుంబ సమగ్ర సర్వే చేపట్టడం చరిత్రలో నిలిచిపోయే చారిత్రాత్మక కార్యక్రమం అని చెప్పవచ్చు. డెబ్బైఏడు సంవత్సరాల స్వాతంత్ర్య భారత దేశంలో రాజ్యాంగం ప్రకారం బిసి లకు న్యాయం జరగడం లేదని "మేమెంతో మాకంతా " అన్న నినాదంతో దశబ్దకాలం పాటు బిసి సంఘులు అన్ని రంగాల్లో జనాభా ధామాషా ప్రకారం వాటా దక్కాలనే బిసి మేధావులు కుల సంఘాలు దేశ వ్యాప్తంగా పోరాటాలు చేస్తున్న విషయం విదితమే. సమాజంలో 55 శాతం ఉన్న బిసి లు సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ వ్యాపార రంగాలలో వెనుకంజలో వున్నారు. రాజకీయ ఫలాలు పొందడం లేదని తాము కేవలం ఓట్లు వేసే వారిగానే మిగులుతున్నామని అనేక రాష్ట్రాల్లో బిసిలు పోరు బాట పడుతున్న నేపథ్యంలో దేశంలో బిసి కులగణన జరగాలనే డిమాండ్ తెరపైకి వచ్చిన తరుణంలోనే 2023 డిసెంబర్ లో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణలో బిసి లకు ఇచ్చిన హామీని నిలబెట్టుట కొరకు ఈ నెల 6 నుండి కులగణనను రాష్ట్రంలో ప్రారంభించింది. స్థానిక ఎన్నికలైన గ్రామ పంచాయతీ, ఎం.పి.టి.సి, జడ్.పి.టి.సి ఎన్నికల్లో బిసి లకు 42 శాతం రిజర్వేషన్లను తూచా తప్పకుండా అమలు పరుస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉన్నప్పటికీ గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అమలు సాధ్యమేనా అనే అనుమానాలు బిసి నేతలు వ్యక్తం చేస్తున్నారు. బిసి కమిషన్ బృందం తెలంగాణలోని అన్ని జిల్లాల్లో కుల సంఘాలతో బహిరంగ విచారణ పేరుతో అభిప్రాయాలను తీసుకుంది. దేశంలోని తమిళనాడులో నాటి జయలలిత ప్రభుత్వం వారి జనాభా ప్రకారం రిజర్వేషన్లు అమలు పరచాలనే ప్రత్యేక ఆర్డినెన్సును తీసుకొచ్చి పార్లమెంటులో పంతం నెగ్గించుకుంది . తమిళనాడు తరహాతోనే బీహార్ రాష్ట్రం కులగణనకు పూనుకొని 50 నుండి 55 శాతం రిజర్వేషన్లు పెంచగా పాట్నా హైకోర్టు కొట్టివేసింది. సుప్రీంకోర్టుకు వెళ్లగా మళ్ళీ అదే తీర్పు వచ్చింది. 50 శాతానికి రిజర్వేషన్లు పెంచకూడదనే తలంపుతో న్యాయ వ్యవస్థ చేపుతుండడం ఒక ఎత్తు. కాగా తెలంగాణలో అమలుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూసాని వెంకటేశ్వర రావు నేతృత్వంలో డెడికెటెడ్ బిసి కమిషన్ ను నియమించింది. ఈ కమిటీతోనైనా చట్ట బద్ధత కల్పించి ప్రత్యేక ఆర్డినెన్సు ద్వారా లోక్ సభలో రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టి అవసరమైతే న్యాయ నిపుణులతో కమిటీ వేసి న్యాయ చిక్కులు లేకుండా రిజర్వేషన్లు అమలు చేయాలనే బిసి సమాజం ముక్తకంఠంతో తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతుంది. 42 శాతం రిజర్వేషన్లు అమలైతే రాజకీయంగా కొంతపాటు బిసి లకు స్థానిక సంస్థలతో పాటు అసెంబ్లీ, పార్లమెంటులో సైతం 42 శాతం అవకాశాలు కల్పించాలని బిసి సంఘాలు కోరుతున్నాయి. బిసి ఆకాంక్షలు నెరవేరాలని ఆశిద్దాం.

## ఉచితాలు కాదు.. ఉన్న వనరులు వినియోగించుకోవాలి

**వరంగల్ , డిసెంబర్ 16 , మహా:** ప్రభుత్వాలు అందించే ఉచిత పథకాలు కాదని మన పరిసరాల్లో ఉన్న వనరులను వినియోగించుకొని అభివృద్ధిలో ముందుకెళ్లాలని జాతీయ ఎస్టి కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ కోరారు.సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పీఎం విశ్వకర్మ పథకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నుంచి రాయితీలు అందిస్తున్నాయన్నారు. తాత్కాలికంగా లభించే ఉచిత పథకాల కోసం ఎదురు చూడవద్దని ఆయన యువతకు సూచించారు. ఉపాధి , ఉద్యోగ అవకాశాలు లభించే పరిశ్రమలు ఏర్పాటుపై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలన్నారు. గిరిజన కమిషన్ ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేసే అవకాశం ఉందన్నారు. ఉద్యోగ సంపాదిస్తే ఒక కుటుంబమే లబ్ధి చెందుతుందని అదే పారిశ్రామికంగా అడుగులు వేస్తే పదిమందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి మనం చేరుకోవచ్చని ఆయన చెప్పారు. ఈ పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రచార నిర్వహించాలని ఆదేశించారు.

# ఆదిలాబాద్‌పై చలి పంజా

**సింగిల్ డిజిట్ కి పడిపోయిన ఉష్ణోగ్రతలు**

**ఆదిలాబాద్ మహా:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా చలి పంజా విసురుతోంది.తీవ్రమైన చలి ప్రజలను వణికిస్తోంది. రెండు రోజులుగా సింగల్ డిజిట్‌కు ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలికి జనాలు బేజారవుతున్నారు. ఆదిలాబాద్ లో గత రాత్రి ఉష్ణోగ్రత 4.7డిగ్రీలకు పడిపోవడం కలవరానికి గురి చేస్తోంది. ఈశాన్యం నుండి తక్కువ ఎత్తులో బలమైన గాలులు వీస్తుండడంతో చలి తీవ్రత పెరుగుతోంది. ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం దట్టమైన మంచు దుప్పటి కప్పేస్తోంది, ఉదయం 10 దాటినా పొగమంచువీడడం లేదు.వాహనదారులు జాగ్రత్తలు పాటించాల్సిందిగా అధికారులు సూచిస్తున్నారు.అటు ప్రజలు చలి మంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు. ఉదయం వాకింగ్ కు , ట్యూషన్ కు వెళ్లే విద్యార్థులు స్వెట్టర్లు , మంకీ క్యాప్ లు ధరించి చలి బారి నుండి రక్షణ పొందుతున్నారు.ఆస్తమా పేషెంట్లు , పిల్లలు , వృద్ధులు తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. కొన్ని మారు మూల గ్రామాల్లో వ్యవసాయదారులు గోనె పట్టాలతో చేసిన తొడుగులతో తమ పశువులను చలి బారి నుండి కాపాడుకుంటు



న్నారు. జనవరి లో నమోదు కావలస్సిన ఉష్ణోగ్రతలు డిసెంబర్ రెండో వారంలోనే నమోదు కావడంతో మున్ముందు ఉష్ణోగ్రతలు ఇంకెంతలా పడిపోతాయోనన్న ఆందోళన నెలకొంది.

### జిల్లాలో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు

బోథ్ మండలం పొచ్చెర 6.4 డిగ్రీలు, జైనథ్ 6.5, నేరడి గొండ 6.6, భీంపూర్ మండలం అర్లి (టి) 6.7, బేల 6.7, సొనాల 6.8, తాంసి 6.9, తలమడుగు 6.9, ఉట్నూర్ 7.2, సిరికొండ 8.2, బజార్ హత్నూర్ 8.8, గుడిహత్నూర్ 9.2 డిగ్రీలుగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి

# ఆరె కుల సంక్షేమ భవన నిర్మాణానికి అనుమతులు



హైదరాబాద్ , డిసెంబర్ 16, మహా.

ఉప్పల్ భగాయత్‌లో ఆరె కుల సంక్షేమ భవన నిర్మాణానికి సంబంధించి కీలక అడుగు పడింది. కుల సంఘానికి కేటాయించిన 1 ఎకరం స్థలంలో భవనం నిర్మాణానికి అవసరమైన అనుమతులను సోమవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ఆరె కుల నాయకులకు అందజేశారు. ముఖ్యమంత్రి శ్రీ ఏనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ అనుమతులు జారీ చేయబడగా, ఈ కార్యక్రమంలో కుల సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్టీరింగ్ కమిటీ చైర్మన్ లింగంపల్లి కిషన్ రావు, రాష్ట్ర అధ్యక్షుడు రేకెందర్ చలపతి రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికెల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జెండా అంబయ్య, సోమిడి శ్రీనివాస్, తిప్పారపు మల్లేశం, అముదాపురం కృష్ణాజి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎసిక శంకర్ రావు, ఆరె యువసేన రాష్ట్ర అధ్యక్షుడు దోనె శివాజి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని సన్మానించారు. భవనం నిర్మాణానికి సంబంధించి త్వరలోనే భూమి పూజ కార్యక్రమం నిర్వహిస్తామని కుల సంఘం నాయకులు వెల్లడించారు. సమాజ హితం కోసం ఆరె కుల నాయకులు తీసుకుంటున్న ఈ చర్యలు ప్రశంసనీయమని మంత్రి పేర్కొన్నారు.

# అట్టహాసంగా సీఎం కప్ క్రీడా పోటీలు

**నిర్మల్ మహా :** క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు ప్రతిభను మెరుగుపరుచుకోవడానికి ఉపయోగపడతాయని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం సీఎం కప్ 2024 జిల్లా స్థాయి క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు.ఈ సందర్భంగా క్రీడాకారులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ, సీఎం కప్ యువతకు క్రీడా ప్రాముఖ్యతను చాటి చెప్పే గొప్ప వేదిక అన్నారు. యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు వారి ప్రతిభను మెరుగుపరచడానికి ఒక అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తాయన్నారు. సీఎం కప్ క్రీడా పోటీలలో గ్రామ స్థాయి నుండి రాష్ట్రస్థాయిలో పాల్గొనేలా యువతను ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. మండల స్థాయిలో విజయవంతంగా పోటీలను నిర్వహించడం జరిగిందని నేటి నుండి 4 రోజులపాటు జిల్లా స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడలలో పాల్గొంటారని తెలిపారు. క్రీడా పోటీల్లో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. గెలుపోటములు సహజమని, కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసమే నిజమైన విజేతలుగా నిలబెడతాయి అన్నారు. యువత చదువుతోపాటు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా పథకాలు సాధించాలని అన్నారు. క్రీడా నైపుణ్యాన్ని పిల్లల్లో అభివృద్ధి చేయడానికి, నైపుణ్యం కలిగిన కోచ్‌లను నియమించడానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి



పంపుతానని తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల కొరకు నిర్మల్ జిల్లాలో స్పోర్ట్స్ పాఠశాల నిర్మించే విధంగా తమవంతు ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం విద్యా, ఉద్యోగాలలో రెండు శాతం రిజర్వేషన్ కల్పించడం జరుగుతుందని, క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ కమర్ అహ్మద్, ఎఫ్.ఎ. సి.ఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ రవీందర్ గౌడ్, పేటా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూక్య రమేష్, భోజన్న, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి సునీల్, వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, జిల్లాలోని న్యాయమ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఎస్సై



**వరంగల్, డిసెంబర్ 16, మహా:** నల్లబెల్లి పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన వి. గోవర్ధన్ సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝ మర్యాద పూర్వకంగా కలుసుకొని పూల మొక్కను అందజేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలకు నిత్యం అందుబాటులో వుంటూ, నీతి, నిజాయితీతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ ఎస్సైకి సూచించారు.

## ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలి: అలుగుబెల్లి నర్సిరెడ్డి



**వరంగల్ , డిసెంబర్ 16, మహా:** సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎంఎల్ సి అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు.సోమవారం మండలంలోని పసర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎస్ యుటిఎఫ్ నాలుగవ జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా నర్సిరెడ్డి హాజరై మాట్లాడారు. సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని, ఆ పరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలు అన్నిటికీ నిష్కరించాలని, పెండింగ్ లో ఉన్న అన్ని రకాల బిల్లులను క్లియర్ చేయాలని, అన్ని యజమాన్యాలలో ఉన్న సీనియర్ ఎస్ జి టి లకు పిఎస్ హెడ్ మాస్టర్ ప్రమోషన్స్ కల్పించాలని, ప్రాథమిక పాఠశాలలో ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించాలని,ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అందరూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుటకు కృషి చేయాలని అన్నారు.

## వరంగల్ జిల్లాలో గ్రూప్2 పరీక్ష ప్రశాంతం

**వరంగల్, డిసెంబర్ 16, మహా.** ఉమ్మడి ఓరుగల్లు జిల్లాలో గ్రూప్2 తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సత్య శారదా దేవి పర్యవేక్షించారు. ఉదయం పేపర్ 1కు 52 శాతం, మధ్యాహ్నం పేపర్ 2కు 51.78 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ములుగు జిల్లాలో 9 కేంద్రాలను ఏర్పాటు చేయగా, 2195 మందికి పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాలను ములుగు అడిషనల్కలెక్టర్సంపత్రావు పరిశీలించారు. పరీక్షకు ఉదయం సెషన్లో 1118 మంది హాజరు కాగా, 1077మంది గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం సెషన్లో 1115మంది హాజరు కాగా, 1080 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. కాగా, పరీక్షకు సమయానికి రాకపోవడంతో నలుగురు అభ్యర్థులు వెనుదిరిగినట్లు తెలిసింది. జనగామ జిల్లాలో 16 సెంటర్లను ఏర్పాటు చేయగా 5470 మంది అభ్యర్థులకు ఉదయం పేపర్1 కు 2959 మంది, మధ్యాహ్నం పేపర్2 పరీక్షకు 2947 మంది హాజరయ్యారు. సెంటర్ల వద్ద డీసీపీ రాజమహేంద్ర నాయక్ పర్యవేక్షణలో పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. వరంగల్జిల్లాలోని పాలెం ఇన్ఫాంట్జిసస్కూల్పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్సత్య శారదాదేవి పరిశీలించారు.

# ఘనంగా అయ్యప్ప పడి పూజ

**నిర్మల్ మహా :** జిల్లా కేంద్రంలోని డాక్టర్స్ లైన్ ప్రాంగణం అయ్యప్ప స్వామి నామస్మరణతో మారుమోగింది. వేద పండితులు నగేష్ శర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి సుబ్రహ్మణ్య స్వామి అయ్యప్ప స్వామి విగ్రహాలకు పంచామృతలతో అభిషేకాలు చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి పదునెట్టాంబడి వెలిగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వప్న శశికాంత్ ,కడ్తాల్ శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయ గురుస్వామి నర్సారెడ్డి, గురుస్వాములు చెనిగారపు చిన్నయ్య, బద్రి శ్రీనివాస్, అమ్ముల సిద్ధు, శంకర్,సాయి, దత్తాద్రి, గోవర్ధన్, కదార్ల హరిప్రసాద్, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



# నేరడి గొండలో హైమాస్ట్ లైట్ల వెలుగులు

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా నేరేడిగొండ మండల కేంద్రంలోని వివిధ కాలనీలలో 27 లక్షల విలువ గల 18 హైమాస్ట్ లైట్లను బోథ్ నియోజకవర్గం ఇంచార్జి ఆడే గజేందర్ కొబ్బరికాయకొట్టి ప్రారంభించారు. దీంతో నేరడిగొండ మండల కేంద్రం వెలుగులు చిమ్ముతూ మెరిసిపోయింది. ఈ సందర్భంగా గజేందర్ మాట్లాడుతూ ఇంచార్జి మంత్రి సీతక్క సహకారం తో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని ఎప్పుడు ఏ అవసరం వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. కాలనీ వాసులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఆయన వెంట మండల అధ్యక్షులు వ్యవసాయ శాఖ ఉపాధ్యక్షులు ఆడే వసంతరావు,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోతా రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మైనార్టీ చైర్మన్ వకీల్ , ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు కపిల్ దేవ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, ఉమేష్, తజమ్ముల్, సికిందర్, సుదర్శన్ రెడ్డి , సుశీల తదితరులు పాల్గొన్నారు.



EDITORIAL
ఎడిటోరియల్

# నియామకాల తెలంగాణ

## పరీక్షలు.. ఫలితాలు.. టైమ్ టు టైం.. ఇది కదా యూత్ కోరుకున్న మార్పు

**మహా ప్రత్యేకం:**

**ఒకప్పుడు నిరుద్యోగుల్లో అభద్రత. పరీక్షలు ఎపుడు జరుగుతాయో తెలీదు. జరిగినా.. లీకులు లేకుండా జరుగుతాయన్న గ్యారంటీ లేదు. ఫలితాలపై అసలే గ్యారంటీ లేదు. ఇక నియామకాల సంగతి దేవుడెరుగు. ప్రిపేరయితున్నమని.. కోచింగ్ సెంటర్లను బతికిస్తూ, తమ బతకలేక, ఉద్యోగాలు పొందలేక సతమతమయ్యారు. కానీ ఇపుడు అంతా రివర్స్ అయింది. కోరుకున్న మార్పును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకొచ్చారు. ప్రజాపాలన పేరుతో.. 55వేలకు పైగా ఉద్యోగాలు భర్తీచేశారు.**

గత ఏడాది డిసెంబర్ 7న రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటయ్యింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముఖ్యమైన అంశాల్లో ప్రధానమైనది నిరుద్యోగ సమస్య. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడవంతో ఆ ఎఫెక్ట్ ను ఎన్నికల్లో చవిచూడకతప్పలేదు. మూడోసారి కూడా తామే అధికారంలోకి వస్తామన్న భరోసాలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి నిరుద్యోగులు ఊహించని విధంగా దెబ్బ కొట్టారు. కాంగ్రెస్ పార్టీకి అధిక సీట్లను కట్టబెట్టి ఒకవైపు తమ సత్తా ఏంటో చూపించారు.. మరో వైపు రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలంటూ ఓట్ల రూపంలో విన్నవించారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తాము అధికారంలోకి రావడానికి కారణమైన నిరుద్యోగులకు న్యాయం చేయాలని నిశ్చయించుకుంది. ఆ దిశగా అడుగులు ప్రారంభించింది. ఇప్పటివరకు వేల సంఖ్యలో ఉద్యోగాలను చేపట్టింది. ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం సెలబ్రేషన్స్ ను నిర్వహించింది. ఈ సందర్భంగా ఉద్యోగాల భర్తీకి సంబంధించిన వివరాలను స్పష్టం చేసింది. తాము అధికారంలోకి వచ్చాక 55,143 ఉద్యోగాలిచ్చామంటూ పేర్కొంది.



**ఇప్పటివరకు ఇచ్చిన ఉద్యోగాలు**
55,143

**హోంశాఖలో**
16,057

**విద్యాశాఖలో**
11,062

**గ్రూప్ - 4 ఉద్యోగాలు**
8,143

**వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో**
6,956

## ఇప్పటివరకు ఇచ్చిన ఉద్యోగాలు

వారు పేర్కొన్న వివరాల ప్రకారం.. హోంశాఖలో 16,057, విద్యాశాఖలో 11,062, గ్రూప్ 4 ఉద్యోగాలు 8,143, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో 6,956, బీసీ సంక్షేమ శాఖలో 5,134, ఎస్సీ అభివృద్ధి శాఖలో 1,769, మైనారిటీ సంక్షేమ శాఖలో 1,395, ఎస్టీ సంక్షేమ శాఖలో 1,070, నీటి పారుదల శాఖలో 722, రెవెన్యూ శాఖలో 609, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో 499, ఇంధన శాఖలో 441, ఉన్నత విద్య శాఖలో 387, రవాణా, రోడ్లు, భవనాల శాఖలో 332, పురపాలక పట్టణాభివృద్ధి శాఖలో 222, పశుసంవర్ధక, మత్స్య, డైరీ శాఖలో 171, వ్యవసాయ, సహకార శాఖలో 164 పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. వీటితోపాటు త్వరలోనే గ్రూప్ 1, గ్రూప్ 2 పోస్టులకు సంబంధించిన నియామకపత్రాలను కూడా అందించబోతున్నామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొంది.

**బీసీ సంక్షేమ శాఖలో**
5,134

**ఎస్సీ అభివృద్ధి శాఖలో**
1,769

**మైనారిటీ సంక్షేమ శాఖలో**
1,395

**ఎస్టీ సంక్షేమ శాఖలో**
1,070

**నీటి పారుదల శాఖలో**
722

**రెవెన్యూ శాఖలో**
609

**పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో**
499

**ఇంధన శాఖలో**
441

**ఉన్నత విద్య శాఖలో**
387

**రవాణా, రోడ్లు, భవనాల శాఖలో**
332

**పురపాలక పట్టణాభివృద్ధి శాఖలో**
222

**పశుసంవర్ధక, మత్స్య, డైరీ శాఖలో**
171

**వ్యవసాయ, సహకార శాఖలో**
164
**పోస్టులు భర్తీ**

## మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి

గ్రూప్ 1, డీఎస్సీ పరీక్షల సమయంలో పలువురు అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. వాటిని వాయిదా వేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఓ విషయాన్ని పదే పదే నొక్కి చెప్పారు. 'ఏదిఏమైనా ప్రభుత్వం పరీక్షలను నిర్వహించి తీరుతుంది.. ఎన్ని అడ్డంకులు ఎదురైనా పరీక్షల నిర్వహణలో వెనక్కి తగ్గేదిలేదు.. అనుకున్న సమయానికి పరీక్షలను నిర్వహిస్తాం' అంటూ పేర్కొన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, వారి బాధ ఏంటో తమకు తెలుసనని, పరీక్షలను పోస్ట్ పోన్ చేసుకుంటూ పోతే నిర్వహణ సాధ్యం కాదు, నిరుద్యోగుల సమస్య పరిష్కారం కాదంటూ స్పష్టం చేశారు. పరీక్షలను నిర్వహించి వెనువెంటనే వారికి నియామక పత్రాలను అందజేస్తామని, ఉద్యోగం సాధించని నిరుద్యోగులు ప్రైవేట్ రంగాల్లో సెట్ అవుతారంటూ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దీంతో అభ్యర్థుల సమయం వృథా కాదని వివరించారు. అనవసరంగా ఆందోళనలు చేయొద్దు.. గత ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోలేదని చెప్పారు. తాము అలా కాదని, ప్రణాళికబద్ధంగా మాట ఇచ్చిన ప్రకారంగా ఉద్యోగాలు ఇచ్చి తీరుతామంటూ తేల్చి చెప్పారు. చెప్పినట్టుగానే ప్రభుత్వం పరీక్షలను నిర్వహించింది. అందుకు సంబంధించిన నియామక పత్రాలను కూడా వారికి అందజేసుకుంటూ వస్తోంది.

## నమ్మకం ఏర్పడింది

ఈ లెక్కన చూసుకుంటే రాష్ట్రంలో ఇప్పటివరకు 55,143 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించాయి. వారంతా కూడా ఉద్యోగాలు చేసుకుంటూ సెట్ అయ్యారు. వాళ్ల ఫ్యామిలీలు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. త్వరలోనే 563 మంది గ్రూప్ 1 అభ్యర్థులు కూడా నియామక పత్రాలను అందుకుని ఉద్యోగాల్లో నిమగ్నమవ్వనున్నారు. 783 మంది గ్రూప్ 2 అభ్యర్థులు కూడా నియామక పత్రాలను అందుకోనున్నారు. దీంతో రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ సమస్య కొంత వరకు తీరిందనే చెప్పుకోవాలి. ఈ క్రమంలోనే ప్రభుత్వంపై ప్రశంసల వర్షం కురుస్తోంది. అసలు లేనిదాని కంటే ఎంతోకొంత ఇస్తున్నారు కదా.. అంటూ ప్రభుత్వాన్ని నిరుద్యోగులు, ప్రజలు అభినందిస్తున్నారు. గత ప్రభుత్వం ఎప్పుడు పరీక్షలు నిర్వహించినా ఏదో కారణంగా వాటిని నిలుపుదల చేసిందని, కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినట్టుగానే పరీక్షలను నిర్వహించి ఉద్యోగాలిస్తుందంటూ పేర్కొంటున్నారు. ఏడాదిలోనే ఇన్ని ఉద్యోగాలు ఇచ్చారంటే మిగతా నాలుగు సంవత్సరాల్లో కూడా నిరుద్యోగ సమస్య ఖచ్చితంగా తీరుతుందనే భరోసా తమకు కలుగుతుందని చెబుతున్నారు. గత ప్రభుత్వం పరీక్షలు నిర్వహించినా వాటిని రద్దు చేస్తూ వచ్చిందని, ఈ క్రమంలో తామంతా నిరుత్సాహంగా ఉండేవారమని, కానీ, ప్రస్తుత ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తుంటూ తమకు నమ్మకం కలుగుతుందని చెబుతున్నారు. ఎక్కడా కూడా తమ సమయం వృథా కాదన్న నమ్మకం ఏర్పడుతుందంటున్నారు.

## సంతోషంగా ఉంది



గ్రూప్ 4 ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకోవడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం నేను ఉద్యోగంలో నిమగ్నమయ్యాను. ఇకముందు కూడా ఉద్యోగాలను భర్తీని త్వరిత గతిన చేపట్టి నిరుద్యోగులకు న్యాయం చేయాలి. టీజీపీఎస్సీ ఛైర్మన్ గా బుర్రా వెంకటేశంను నియమించడంతో నియామకాలలో పారదర్శకత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాను.

**-చెర్వుగట్టు శ్రీకాంత్**

## నలుగురి ఉద్యోగాలు పోతే.. 50 వేల ఉద్యోగాలు

కేసీఆర్ కు రెండుసార్లు అధికారం ఇచ్చినా నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరలేదు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాదిలోపే 50వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. నలుగురి ఉద్యోగాలు పోతే.. ఒక్క ఏడాదికే 50 వేల ఉద్యోగాలు వచ్చాయి. ఇంకా నోటిఫికేషన్లు ఇస్తాం. ఎక్కడ ఖాళీలు ఉన్నా భర్తీ చేస్తాం.

**- రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి**



## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp-
7436939999

# రేషన్ బియ్యం గోదాముపై పోలీసుల దాడి



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 16 మహా:** పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు. మన్నెగూడ లో నివాసం ఉండే నరేష్ అనే వ్యక్తి గ్రామాలలో ప్రజల వద్ద నుంచి తక్కువ ధరకు సేకరించి కోళ్ల ఫారాలలో అధిక ధరకు విక్రయించడం జరుగుతుందని తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, ప్రజల వద్ద నుండి సేకరించిన పిడిఎస్ బియ్యాన్ని ఇబ్రహీంపట్నం మండలం మంగళపల్లి గ్రామ పరిధిలోని సాగర్ హైవే సమీపంలో ఉన్న ప్రేమ్ రైస్ మిల్ షెటరులో అక్రమంగా నిల్వ చేశాడని అన్నారు. పక్క సమాచారం అందుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు ఎస్సై చందర్ సింగ్ నేతృత్యంలో పిడిఎస్ బియ్యం నిల్వ ఉంచిన గోదాం పై దాడి చేయగా దాదాపు 280 సంచులలో 14 టన్నుల వరకు పిడిఎస్ బియ్యం ఉన్నట్లుగా గుర్తించారు. అక్రమంగా నిల్వచేసిన బియ్యాన్ని ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాంకు పోలీసులు తరలించారు. సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. పేదలకు ప్రభుత్వం అందించే బియ్యాన్ని కొందరు కేటుగాళ్లు తక్కువ ధరకు తీసుకొని ఎక్కువ ధరకు విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో పిడిఎస్ బియ్యం పక్కదారి పడుతుందని, పోలీస్ యంత్రాంగం తరచూ అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటున్న, అక్రమార్కులు మాత్రం వాళ్ళ మార్క్ కొనసాగిస్తూనే ఉన్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్య వేక్షిస్తేనే అక్రమ దందాకు చెక్ పడుతుందని అంటున్నారు.

# ప్రశాంతంగా గ్రూప్ 2 పరీక్షలు

**మొత్తం 10 వేల 428 మంది.. ఎగ్జామ్స్‌కు హాజరైనవారు 5,773 మంది అభ్యర్థులు**

**ఆదిలాబాద్ మహా :** జిల్లాలో నిర్వహించిన గ్రూప్ 2 పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. రెండోరోజు సైతం అభ్యర్థులు నిర్దేశిత సమయం కంటే ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. నిమిషం నిబంధన అమల్లో ఉన్న నేపథ్యంలో గంట ముందుగానే కేంద్రాల లోపలికి క్షుణ్ణంగా పరిశీలించి అభ్యర్థులను అనుమతించారు. చాలాచోట్ల సమయం దాటిన తర్వాత వచ్చిన వారిని వెనక్కి తిరిగి పంపించేశారు. ఉదయం పది నుండి 12 గంటల ముప్పై నిమిషాల వరకు, మధ్యాహ్నం మూడు నుండి సాయంత్రం అయిదు గంటల ముప్పై నిమిషాల వరకు పరీక్షా కొనసాగింది. అభ్యర్థులు హాల్ టికెట్ నంబర్లను సరిచూసుకున్న అనంతరం లోనికి వెళ్లారు. జిల్లాలో మొత్తం 29 కేంద్రాల్లో పరీక్షా జరగగా.. అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన పూర్తి ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలకు తావులేకుండా సెంటర్ల వద్ద 144 సెక్షన్ ను అమలు చేసి పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం పది వేల 428 మందికి గాను 5773 మంది హాజరవ్వగా 55.36 శాతం హాజరుశాతం నమోదైంది. 4 వేల 655 మంది గైర్హాజరు కాగా 44.64 శాతం నమోదైంది. మరోవైపు పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్, ఎస్పీ స్వయంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల లోపల, పరిసర ప్రాంతాల నందు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ 144 సెక్షన్ అమల్లో ఉంచారు. పరీక్షా కేంద్రాల వద్ద పరిసర ప్రాంతాలను పర్యవేక్షిస్తూ నిరంతరం పెట్రోలింగ్ గస్తీ నిర్వహిస్తు పకడ్బందీగా ఏర్పాటు చేసినట్టు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు





# ట్రాన్స్ పోర్ట్ గోదాంలో లేబర్ మృతి

**న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల ఆందోళన**

**ఎల్బీనగర్ ,మహా:** ట్రాన్స్ పోర్ట్ గోదాం వద్ద లారీలో వచ్చిన పార్సిల్ ను దించే క్రమంలో లారీ మీది నుండి కిందపడి కూలీ మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోనగర్ లో చోటుచేసుకుంది. పోలీసులు బాదిత బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మన్సూరాబాద్ ఓల్డ్ విలేజ్ కి చెందిన కొమరయ్య(49) ఆటో నగర్ లోని దీపక్ ట్రాన్స్ పోర్ట్ లో గత 18 ఏళ్లుగా లేబర్ గా పనిచేస్తున్నాడు. కాగా రోజులానే సోమవారం కూడా పని చేసేందుకు ట్రాన్స్ పోర్ట్ ఆఫీస్ కు వెళ్ళాడు అక్కడ లారీలో లోడ్ రావడంతో ఆ లోడ్ లో ఉన్న పార్సిల్స్ దించేందుకు లారీ పైకి ఎక్కడు పై నుండి పార్సెల్ బాక్స్ ను కిందకు దింపే క్రమంలో కొమరయ్య లారీ మీద నుండి పక్కనే ఉన్న మరో లారీకి తగులుతూ కింద పడ్డాడు దీంతో తలకు తగిలిన తీవ్రగాయంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా కొమరయ్య కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన కుటుంభ సభ్యులు బంధువులు మన్సూరాబాద్ వాసులు ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు ట్రాన్స్ పోర్ట్ యాజమాన్యంతో మాట్లాడి సర్ది చెప్పి అక్కడినుండి పంపించారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

# ఏప్రిల్ 23 వరకు సాగర్ జలాలు..!

**ఏడు దశలుగా నీటి విడుదల.. షెడ్యూల్ విడుదల చేసిన అధికారులు**

**ఖమ్మం, డిసెంబరు 16, మహా:** నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల షెడ్యూల్ ను ఎన్ఎస్పీ సూపరింటెండింగ్ ఇంజనీర్ సోమవారం విడుదల చేశారు. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని రైతుల సాగు అవసరాల కోసం ఇరిగేషన్ శాఖ డిసెంబర్ 15 నుండి ఏప్రిల్ 23, 2025 వరకు నీటి విడుదల షెడ్యూల్‌ను ప్రకటించింది. మొత్తం 7 దశలుగా వ్యవసాయానికి అవసరమైన నీటిని విడుదల చేయనున్నారు. మొదటి విడత డిసెంబర్ 15 నుండి జనవరి 11 వరకు 27 రోజుల పాటు నీరు అందుబాటులో ఉంటుంది. దీని తరువాత జనవరి 19న రెండవ విడత ప్రారంభమై జనవరి 28 వరకు కొనసాగుతుంది. మూడవ దశ ఫిబ్రవరి 5న ప్రారంభమై ఫిబ్రవరి 14 వరకు కొనసాగుతుందని, నాలుగవ దశ ఫిబ్రవరి 22న ప్రారంభమై మార్చి 3 వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఐదవ దశ మార్చి 11 నుండి మార్చి 20 వరకు, ఆరవ దశ మార్చి 28 నుండి ఏప్రిల్ 6 వరకు కొనసాగుతుంది. చివరి విడతగా ఏప్రిల్ 14న ప్రారంభమై ఏప్రిల్ 23, 2025న పూర్తవుతుందని వెల్లడించారు. ఈ విడుదలతో వ్యవసాయ పనులను సమయానికి పూర్తి చేసుకోవాలని, నీటి వినియోగం ప్రణాళికాబద్ధంగా చేసుకోవాలని ఇరిగేషన్ శాఖ రైతులకు సూచించింది.

# తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు

**పెండింగ్ వేతనాలు బిల్లులు కార్మికులకు చెల్లించాలి**

**విద్యార్థులకు ఇచ్చే మెనూ చార్జీలు చెల్లించాలి**

**జిల్లా కలెక్టరేట్ వద్ద సిఐటియు నాయకుల ధర్నా**

**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 16 మహా:** మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండిగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో 48 గంటల ధర్నాను నిర్వహించడం జరిగింది. ధర్నాలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకిచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకిచ్చే మెనూ చార్జీలు పెండింగ్లో ఉన్నాయి. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి, వంట చేసి పెడుతున్నారు. దీంతో కార్మికులు అప్పుల పాలౌతున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో చేసిన వాటికే బిల్లులు రాలేదు. పైగా రాగి జావ పోయాలి, బిల్లులు రాకపోయినా పిల్లలకు వండి పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. బిల్లులు విడుదల చేయకుండా వండటం ఎలా? కనుక ప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని కోరుతున్నాము. పెరిగిన వేతనం కొన్ని జిల్లాల్లో కొన్ని మండలాల్లో మాత్రమే ఇచ్చారు. అది కూడా నెల నెలా సక్రమంగా ఇవ్వడం లేదు. ఒకపక్క ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెరిగిన ధరలకనుగుణంగా పిల్లలకిచ్చే మెనూ చార్జీలు పెంచడం లేదు. కార్మికుల జీతాలు పెరగకపోగా ఉన్న జీతాలు కూడా నెలల తరబడి పెండింగ్లో ఉన్నాయి. కార్మికులకు ఇచ్చే జీతమే తక్కువ అది కూడా రాకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ పాత మెనూకే సరిపోవడం లేదు. మెనూ చార్జీలు పెంచాలని, కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేసి కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లోనే వేయాలి. వారానికి 3 కోడిగుడ్లు పెట్టాలని,



రాగి జావ పోయాలని ఒత్తిడి చేస్తున్నారు. గుడ్డుకు కేటాయించిన బడ్జెట్ 2 గుడ్లే సరిపోదు. 3 గుడ్లు ఎలా పెట్టాలి. గుడ్లకు అదనం బడ్జెట్ కేటాయించాలి లేదా అంగన్వాడీ సెంటరుకు సప్లయ్ చేసినట్లుగా మధ్యాహ్న భోజన పథకానికి కూడా అందించాలి. రాగి జావ ఖర్చులకు డబ్బులు ఇవ్వాలి. కార్మికులకు అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలి. రాష్ట్రమంతటా గృహ లక్ష్మి పథకం పేరుతో గ్యాస్ సిలిండర్ రూ.500/లకే ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటించి అమలుకు శ్రీకారం చుట్టింది. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు అవసరమైన గ్యాస్ ను సబ్సిడీకి ఇవ్వాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10,000/ల వేతనం వెంటనే అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు వై స్వప్న, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి కవిత, సిఐటియు జిల్లా నాయకులు పొచమోని కృష్ణ, ఏర్పుల నర్సింహ, శేఖర్, బి బాలరాజు, ఏల్లేష్, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ అధ్యక్షురాలు అలివేలు, ఉపా అధ్యక్షులు గణేష్, పద్మ, నరేందర్, శ్రీను, సరిత లక్షమ్మమ్మ, స్వాతి, శిరీష, సావిత్రి, అక్కమ్మ, భాస్కర్, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన రాష్ట్రస్థాయి జేవీవీ చెకుముకి సంబరాలు

**ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసిన కలెక్టర్**




**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పట్టణంలోని టిటిడిసిలో జరుగుతున్న చెకుముకి రాష్ట్రస్థాయి ముగింపు సంబరాలకు ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ రాజర్షీ షా హాజరై రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ...ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, దేశం కోసం, స్వావలంబన కోసం సైన్స్ నినాదంతో ముందుకుసాగుతున్న జన విజ్ఞాన వేదిక సేవలు అభినందనీయమన్నారు. ఆదిలాబాద్ జిల్లా వేదికగా రాష్ట్రస్థాయి సంబురాలను విజయవంతం చేయడం ప్రశంసనీయమన్నారు. విద్యార్థులు సైన్స్ టెంపర్ డెవలప్ చేసుకోవాలని సూచించారు. 33 జిల్లాల నుండి వచ్చిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మరిన్ని సైన్స్ కార్యక్రమాలను ఇలాగే నిర్వహించి సమాజంలో చైతన్యం తీసుకురావాలని జన విజ్ఞాన వేదిక సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సభ్యులు , విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడల్లో సత్తా చాటాలి

**జిల్లాకు మంచి పేరు తేవాలి.. సీయం కప్ ప్రారంభంలో కలెక్టర్ రాజర్షి షా పిలుపు**

**ఆదిలాబాద్ మహా :** క్రీడాపోటీల్లో తమ సత్తాచాటి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లాస్థాయి సీయం కప్ 2024 క్రీడలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన గావించి పోటీలను ప్రారంభించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి క్రీడాకారులతో కలిసి జనగణమణ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం బెలూన్లను గాల్లోకి వదిలిన తర్వాత క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండలస్థాయిలో సిఎం కప్ 2024 క్రీడలను విజయవంతంగా పూర్తి చేసుకొని జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులను రాజర్షి షా ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాస్థాయి పోటీలలో గెలుపొంది



రాష్ట్రస్థాయిలో డిసెంబర్ 27 నుండి వచ్చే జనవరి 2వ తేదీ వరకు నిర్వహించే క్రీడలలో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఆరు రోజుల పాటు వివిధ రకాల క్రీడా పోటీలు జరుగుతాయని, జిల్లాస్థాయిలో కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, బాడ్మింటన్ బాస్కెట్ బాల్, ఫుట్ బాల్, చెస్, బాక్సింగ్, స్విమ్మింగ్ లతో పాటు మరికొన్ని రకాల క్రీడలు ఉంటాయని తెలిపారు. అంతకుముందు టాస్ వేసి క్రీడలను ప్రారంభించి బెస్ట్ ఆఫ్ లక్ తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్ ఓ వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ అధారిటీ ఆఫీసర్ పార్థసారథి, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పట్నంలో గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంతం

**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 16 మహా:** గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంతంగా ప్రశాంతంగా జరిగాయి. రెండవ రోజు సోమవారం టిఎస్పిఎస్సి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్ టు పరీక్షలు కేంద్రాలలో ప్రశాంతంగా జరిగాయి. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతంలో ఉన్న గురునానక్, శ్రీ ఇందు, సివిఆర్, శ్రీ దత్తతో పాటు పలు ఇంజనీరింగ్ కళాశాలలో గ్రూప్2 పరీక్షలు మొదటి రోజులో భాగంగా ఉదయం పది గంటల నుండి 12:30 వరకు, మధ్యాహ్నం మూడు గంటల నుండి 5:30 వరకు జరిగిన పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు గంట ముందుగానే హాజరయ్యారు. ఆలస్యంగా పరీక్ష కేంద్రాలకు చేరుకున్న అభ్యర్థులను అధికారులు



లోపలికి అనుమతించలేదు. ఇబ్రహీంపట్నం ఏసిపి కేపీవి రాజు సమక్షంలో పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టారు. పరీక్షలు ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# అంతర్‌రాష్ట్ర డ్రగ్స్ ముఠా గుట్టు రట్టు

**భారీగా డ్రగ్స్ స్వాధీనం**

**హైదరాబాద్:** డ్రగ్స్‌ను నియంత్రించేందుకు పోలీసులు, ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఏదో రకంగా డ్రగ్స్ సరఫరా మాత్రం కొనసాగుతూనే ఉంది.. డ్రగ్స్ కేసులో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవన్న పోలీసుల హెచ్చరికలను కూడా డ్రగ్ ఫెడ్లర్‌లు పట్టించుకోని పరిస్థితి. షరా మామూలే అన్న చందంగా డ్రగ్స్ సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తూ ఉన్నారు. పోలీసులకు చిక్కడం.. ఆపై బయటకు వచ్చిన తర్వాత కొద్ది కాలం గ్యాప్ ఇచ్చి మళ్లీ డ్రగ్స్ సరఫరా చేయడం అనేది వారికి పరిపాటిగా మారింది. ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలనే అత్యాశతో చాలామంది డ్రగ్స్‌ను సరఫరా చేస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. చాలాసార్లు యువకులు, స్టూడెంట్స్ కూడా డ్రగ్స్ సరఫరా చేస్తూ పట్టుబడిన సందర్భాలు ఎన్నో. విలాసవంతమైన జీవితం గడపాలని, అతి తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశతో యువత ఈ దారిని ఎంచుకున్నట్లు సమాచారం. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయితే తాజాగా ఎల్బీనగర్‌లో భారీగా డ్రగ్స్ పట్టుబడటం సంచలనంగా మారింది. కోటి 25 లక్షల విలువచేసే 53.5 కిలోల మాదకద్రవ్యాలను



రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. మధ్యప్రదేశ్ నుంచి హైదరాబాద్ మాదకద్రవ్యాల అక్రమ రవాణా చేస్తున్న అంతరాష్ట్ర రాకెట్‌ను మీర్‌పేట్ పోలీసులతో కలిసి ఎల్బీనగర్ జోన్ SOT పోలీసులు ఛేదించారు. నిందితుల నుంచి కోటి 25 లక్షల విలువచేసే 53.5 కిలోల గసగసాల మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. ఈరోజు ఉదయం 11:30 గంటలకు ఎల్బీనగర్ క్యాంప్ ఆఫీసులో మీడియా సమావేశంలో రాచకొండ సీపీ సుధీర్ బాబు వివరాలు వెల్లడించనున్నారు. ముగ్గురు అంతర్రాష్ట్ర ముఠాను ఎస్ఓటి పోలీసులు అరెస్టు చేశారు. గసగసాల , FM వంటి మాదక ద్రవ్యాలను మధ్యప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కి తరలిస్తుండగా పట్టుకున్నారు..

# మోహన్ బాబు ఫ్యామిలీపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయి

**ఎల్బీనగర్‌లో రాచకొండ సీపీ సుధీర్ బాబు**

**ఎల్బీనగర్,మహా:** సినీ నటుడు మోహన్ బాబు ఫ్యామిలీ కేసులో తాము లీగల్ గా ముందు వెళ్తున్నామని, ఈ ఘటనలో మొత్తం మూడు ఎఫ్ఐఆర్ లు నమోదు అయ్యాయని రాచకొండ సిపి సుధీర్ బాబు తెలిపారు. సోమవారం ఎల్బీనగర్ లోని సీపీ క్యాంప్ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు మంచు కుటుంబ వివాదానికి సంబంధించి లీగల్ యాక్షన్ తీసుకుంటున్నట్లు సిపి తెలిపారు. ఇప్పటి వరకు మూడు ఎఫ్ఐఆర్ లు నమోదు అయ్యాయని చెప్పారు. నమోదైన కేసులపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మోహన్ బాబు అరెస్ట్ విషయంలో ఆలస్యమేమి లేదని ఈ నెల 24వ తేదీ వరకు కోర్టు ఆయనకు టైం ఇవ్వడంతో అరెస్ట్ చేయలేదని చెప్పారు. మోహన్ బాబును విచారించేందుకు మేం కోర్టును అనుమతి అడుగుతామని పేర్కొన్నారు. మోహన్ బాబు వద్ద ఉన్న గన్లు చంద్రగిరిలో ఉన్నపుడు తీసుకున్నవని..రాచకొండ పోలీస్ లు ఇచ్చిన గన్ పర్మిషన్స్ లేవని క్లారిటీ ఇచ్చారు. మోహన్ బాబు వద్ద మొత్తం రెండు లైసెన్స్డ్ గన్స్ ఉన్నాయని ఒకటి డీబీపీఎల్, మరొకటి స్పానిష్ మేడ్ గన్ అని చెప్పారు. కోర్టు మినహాయింపు అయిపోయాక మోహన్ బాబుకు




మరోసారి నోటీసులు ఇస్తామని అప్పుడు ఆయన విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని చెప్పారు. పోలీసుల ముందుకు హాజరయ్యేందుకు మళ్ళీ టైం కావాలంటే ఆయన పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. లేదంటే మోహన్ బాబుకు అరెస్ట్ వారంట్ ఇష్యూ చేస్తామని చెప్పారు. మోహన్ బాబు కేసుల విచారణ అంతా లీగల్ గా ముందుకు వెళ్తున్నామని చెప్పారు.

# ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం అందించాలి

**అధికారులను ఆదేశించిన కలెక్టర్ సి నారాయణ రెడ్డి**

**ఇబ్రహీంపట్నం,(రంగారెడ్డి జిల్లా) డిసెంబర్ 16 మహా:** సమీకృత జిల్లా కార్యాలయంలో ప్రజావాణికి (67) ఫిర్యాదులు అందాయని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-52, ఇతర శాఖలకు-15, మొత్తం 67 దరఖస్తులు అందాయి. అనంతరం జిల్లా కలెక్టర్ సి,నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వేను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇంటింటి సర్వేను ఒక ప్రణాళికా పరంగా నిర్వహించాలని, మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, తప్పిదాలకు తావు లేకుండా వివరాలను సేకరిస్తూ ఆన్లైన్ యాప్ లో నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా, పూర్తి పారదర్శకంగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతనంగా ప్రవేశపెట్టిన డైట్ ను సంక్షేమ హాస్టల్స్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అన్ని రకాల పాఠశాలలో అమలు జరిగేలా ప్రతి ఒక్కరు పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహాశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# 18 వేల మంది భారతీయులు వెనక్కి!

## జాబితా సిద్ధం చేసిన అమెరికా.. ట్రంప్ అధ్యక్షుడు కాగానే భారత్‌కు పంపించే అవకాశం




**వాషింగ్టన్, డిసెంబర్ 13:** అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల హామీ మేరకు లక్షలాది మంది అక్రమ వలసదారులను వారి సొంత దేశాలకు పంపించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు అమెరికా నుంచి పంపించాల్సిన 15 లక్షల మంది జాబితాను యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) సిద్ధం చేసింది. నవంబర్‌లో విడుదల చేసిన ఈ జాబితాలో 17,940 మంది భారతీయులు ఉన్నారు. తాను అధికారంలోకి వస్తే అక్రమ వలసదారులను వెనక్కు పంపడానికి అమెరికా చరిత్రలోనే అతి పెద్ద కార్యక్రమాన్ని చేపడతానని ట్రంప్ హామీ ఇచ్చారు. జనవరి 20న ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆ తర్వాత అక్రమ వలసదారులను సొంత దేశాలకు పంపించే చర్యలను అమెరికా ప్రభుత్వం చేపట్టే అవకాశం ఉంది. కాగా, ప్యూ రిసెర్చ్ సెంటర్ అనే సంస్థ డాటా ప్రకారం అమెరికాలో 7.25 లక్షల మంది భారతీయులు అక్రమంగా నివసిస్తున్నారు. అమెరికాలోని అక్రమ వలసదారుల్లో మెక్సికో, ఎల్ సాల్వడర్ దేశాలకు చెందిన వారి తర్వాత భారతీయులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో 90 వేల మంది భారతీయులు అక్రమంగా అమెరికా సరిహద్దు దాటే ప్రయత్నంలో భద్రతా సిబ్బందికి చిక్కారు.

**భారత్‌ను 'సహకరించని దేశం'గా పేర్కొన్న ఐసీఈ**

అక్రమ వలసదారులను దేశం నుంచి పంపేందుకు భారతీయ వ్యవస్థల నుంచి ఆలస్యం జరుగుతున్నదని పేర్కొన్న యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ).. భారత్‌ను 'సహకరించని దేశం' విభాగంలో చేర్చింది. అమెరికా నుంచి అక్రమ వలసదారులను వారి సొంత దేశాలకు పంపే క్రమంలో సహకరించని, వారిని దేశంలోకి అనుమతించని దేశాలను ఈ జాబితాలో ఐసీఈ చేరుస్తున్నది. ఇప్పటి వరకు భారత్, చైనా, పాకిస్థాన్ సహా 15 దేశాలను ఈ జాబితాలో చేర్చింది.

**అందని ద్రాక్షలా హెచ్1బీ వీసాలు**

అమెరికాలో ఉద్యోగం చేసేందుకు ఇతర దేశాలకు చెందిన నిపుణులకు ఇచ్చే హెచ్1బీ వీసాలు భారీగా తగ్గిపోతున్నాయి. ఈ వీసాల కోసం అమెరికాలోని కంపెనీలు ముందుగా పిటిషన్లు పెట్టుకుంటే ప్రభుత్వం ఆమోదం తెలుపుతుంది. గత కొన్నేండ్లుగా భారతీయ ఐటీ కంపెనీలకు హెచ్1బీ వీసా అప్రూవల్స్ తగ్గిపోతున్నాయి. అమెరికాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఏడు ప్రముఖ భారతీయ ఐటీ కంపెనీలకు 2015 ఆర్థిక సంవత్సరంలో 14,792 హెచ్1బీ వీసాలకు ఆమోదం రాగా, 2024 ఆర్థిక సంవత్సరంలో కేవలం 7,299 మాత్రమే వచ్చాయి.

అధికారిక డాటాను విశ్లేషించిన అమెరికాకు చెందిన నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ(ఎన్ఎఫ్ఏపీ) అనే సంస్థ ఈ విషయాన్ని వెల్లడించింది. 2024 ఆర్థిక సంవత్సరంలో అమెరికా ఇచ్చిన మొత్తం హెచ్1బీ వీసా అప్రూవల్స్‌లో ఏడు ప్రధాన భారతీయ సంస్థలకు దక్కింది కేవలం 5.2 శాతం మాత్రమే. ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత తిరస్కరణ శాతం భారీగా పెరిగే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. దీంతో హెచ్1బీ వీసాలు మరిన్ని తగ్గే అవకాశం ఉంది.

# సీఎం అయిన తర్వాత ఒమర్ అబ్దుల్లా వైఖరి మారింది: కాంగ్రెస్



న్యూఢిల్లీ: ఈవీఎంలపై కాంగ్రెస్ తీరును తప్పుబట్టిన జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లాపై ఆ పార్టీ ఎదురుదాడి చేసింది. సీఎం అయిన తర్వాత ప్రతిపక్షాలకు సంబంధించిన సమస్యలపై ఆయన వైఖరి మారిందని కాంగ్రెస్ విమర్శించింది. ఒక ఇంటర్వ్యూలో ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ సీనియర్ నేత మాణికం ఠాగూర్ ఖండించారు. 'ఈవీఎంలకు వ్యతిరేకంగా మాట్లాడింది సమాజ్‌వాదీ పార్టీ, ఎన్సీపీ (ఎస్పీ) , శివసేన (యూబీటీ)లే. ఒమర్ అబ్దుల్లా దయచేసి మీ వాస్తవాలను పరిశీలించండి. కాంగ్రెస్ సీడబ్ల్యూసీ తీర్మానం ఈసీఐని మాత్రమే స్పష్టంగా సూచించింది. సీఎం అయిన తర్వాత భాగస్వామ్య పార్టీల పట్ల ఈ విధానం ఎందుకు?' అని ఎక్స్ పోస్ట్‌లో ప్రశ్నించారు. కాగా, ఒమర్ అబ్దుల్లా ఆదివారం పీటీఐకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈవీఎంల పనితీరుపై కాంగ్రెస్ తరచూ విమర్శలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఓటింగ్ పద్ధతిని ప్రశ్నించడంలో స్థిరంగా ఒక విధానానికి కట్టుబడి ఉండాలని అన్నారు. గెలిచినప్పుడు సంబరాలు చేసుకుని, ఓడినప్పుడు విమర్శలు చేయడం సరికాదని కాంగ్రెస్‌ను ఎద్దేవా చేశారు. ఓటింగ్ పద్ధతిపై నమ్మకంలేని పార్టీలు ఎన్నికల్లో పోటీ చేయకూడదని సూచించారు. ఈ నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ఈ మేరకు స్పందించింది.

# ట్రాక్టర్లపై ర్యాలీగా శంభూ బార్డర్‌కు రైతులు..



కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్‌లను నెరవేర్చాలంటూ రైతులు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. పంజాబ్‌హర్యానా మధ్యనున్న శంభూ బార్డర్‌లో రైతులు తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. రైతులు ఢిల్లీ లోపలికి ప్రవేశించకుండా భద్రతా బలగాలు అడ్డుకుంటుండటంతో.. వారు అక్కడే మకాం వేసి ఆందోళన చేస్తున్నారు. ఇవాళ పంజాబ్ నుంచి రైతులు ర్యాలీగా ట్రాక్టర్‌లపై శంభూ బార్డర్‌కు బయలుదేరారు. ఈ నేపథ్యంలో భద్రతాబలగాలు శంభూ బార్డర్‌లో భద్రతను కట్టుదిట్టం చేశాయి. రైతులు ఢిల్లీ లోపలికి ప్రవేశించకుండా బారికేడ్లను మరింత పెంచారు. పంటకు కనీస మద్దతు ధర సహా పలు డిమాండ్‌ల పరిష్కారం కోసం రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్నారు. కానీ కేంద్ర సర్కారు మాత్రం వారి ఆందోళనను పట్టించుకోవడం లేదు. పైగా పోలీసులతో వారిపై దాడి చేయిస్తోంది. కాగా, కేంద్రం తీరుకు నిరసనగా ఈ నెల 18న పంజాబ్‌లో రైల్‌రోకో నిర్వహించనున్నట్లు రైతులు ఇప్పటికే హెచ్చరించారు.


# అమెరికాలో రోడ్డు ప్రమాదం

## తెలుగు విద్యార్థిని మృతి మరో ఇద్దరికి గాయాలు




వాషింగ్టన్, డిసెంబర్ 15: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భారత్‌కు చెందిన తెలుగు విద్యార్థిని మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. టెనెస్సీ రాష్ట్రంలోని మెంఫిస్ నగరంలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వారి వాహనం, మరో వాహనం ఢీకొనడంతో భారత్‌కు చెందిన 26 ఏండ్ల నాగ శ్రీ వందన పరిమళ గాయపడింది. ఆమెను దవాఖానలో చేర్చగా అక్కడ మృతి చెందింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఆమె యూనివర్సిటీ ఆఫ్ మెంఫిస్‌లో ఎంఎస్ చేస్తున్నది. గాయపడిన పవన్, నిఖిత్‌ల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. రెండు వాహనాల్లో ఒకటి వేగాన్ని నియంత్రించుకోలేక మరో వాహనాన్ని ఢీకొనడంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు అధికారులు తెలిపారు.

# కార్బన్ మోనాక్సైడ్ పీల్చి.. జార్జియా స్కీయింగ్ రిసార్టులో 12 మంది మృతి



**తిబిలిసి:** జార్జియా దేశంలోని స్కీయింగ్ రిసార్టులో విషాద ఘటన చోటుచేసుకున్నది. కార్బన్ మోనాక్సైడ్ విషపూరిత వాయువు పీల్చడం వల్ల 12 మంది మృతిచెందారు. వీరిలో 11 మంది విదేశీయులు, ఓ జార్జియా దేశస్తుడు ఉన్నారు. గుదౌరి ప్రాంతంలో ఉన్న ఓ రెస్టారెంట్ వద్ద ఘటన జరిగింది. నిద్రించే స్థలంలో మృతదేహాలను గుర్తించారు. మాజీ సోవియేట్ ప్రాంతమైన జార్జియాలో ఆ స్కీయింగ్ రిసార్టు ఉన్నది. విద్యుత్తు అంతరాయం ఏర్పడిన సమయంలో.. బిల్డింగ్‌లో ఉన్న ఆయిల్ పవర్ జనరేటర్‌ను స్టార్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఇండియన్ రెస్టారెంట్ ఉన్న బిల్డింగ్ రెండవ ఫ్లోర్‌లో మృతదేహాలను గుర్తించారు. ఈ ఘటన పట్ల దర్యాప్తు ప్రారంభించారు. అయితే మృతుల వివరాలను ఇంకా వెల్లడించలేదు.


# ఇజ్రాయెల్ దాడుల్లో సిరియన్ బంకర్లు ధ్వంసం



**డమాస్కస్:** సిరియా రాజధాని డమాస్కస్, దాని పరిసర ప్రాంతాలపై ఇజ్రాయెల్ సైన్యం శనివారం విరుచుకుపడింది. బ్రిటన్‌లోని సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, కొండ కింద, భూగర్భంలో ఉన్న మిసైల్ బంకర్లు, రాకెట్లు, ఆయుధ డిపోలు, సొరంగాలను ఇజ్రాయెల్ వాయు సేన ధ్వంసం చేసింది. కలమున్‌లోని గోదాములు, మిసైల్ లాంచర్లను సర్వ నాశనం చేసింది. బార్జేహ్‌లోని మిలిటరీ, సైంటిఫిక్ కేంద్రాలపై, డమాస్కస్ శివారులో ఉన్న సైనిక విమానాశ్రయంపై దాడులు జరిగాయి.


# యాప్ స్టోర్స్ నుంచి టిక్‌టాక్‌ను తొలగించాలి

## ఆపిల్, గూగుల్ సంస్థలకు చట్టసభ్యుల విజ్ఞప్తి




ఆపిల్, గూగుల్ సంస్థలకు అమెరికా చట్టసభ్యులు కీలక విజ్ఞప్తి చేశారు. టిక్‌టాక్‌ను ఆపిల్ స్టోర్, గూగుల్ ప్లే స్టోర్ నుంచి తొలగించాలని భారతీయ అమెరికన్ రాజా కృష్ణమూర్తితో సహా ఇద్దరు యూఎస్ చట్టసభ సభ్యులు కోరారు. ఏప్రిల్‌లో ప్రెసిడెంట్ జో బైడెన్ సంతకం చేసిన బిల్లు సహా.. బైటెడెన్స్ నిషేధాన్ని ఎదుర్కొంటుంది. యూఎస్ చట్టసభ సభ్యులు జాన్ మూలేనార్, రాజా కృష్ణమూర్తి ఆపిల్ సీఈవో టిమ్ కుక్, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌లకు లేఖ రాశారు. జనవరి 19లోగా ఆయా యాప్ స్టోర్స్ నుంచి టిక్‌టాక్‌ని తొలగించేందుకు సిద్ధం కావాలని కోరారు. టిక్‌టాక్ సీఈవో షు జీ చౌని వెంటనే పెట్టుబడుల ఉపసంహరణ ప్రతిపాదించాలని లేఖలో కోరారు. ఫారిన్ అడ్వైజరీ కంట్రోల్డ్ అప్లికేషన్ యాక్ట్ నుంచి అమెరికన్లను రక్షించే చర్యను డీసీ సర్క్యూట్ కోర్ట్ సమర్థించింది. ఈ క్రమంలో టిక్‌టాక్‌తో పాటు టీమ్ కుక్, సుందర్ పిచాయ్‌లకు చట్టసభ్యులు లేఖలో పంపారు. టిక్‌టాక్‌పై ఇప్పటికే చాలాదేశాలు నిషేధించాయి. టిక్‌టాక్‌ను భారత్ జూన్ 2020లో బ్యాన్ విధిస్తూ నిర్ణయం తీసుకున్నది. భద్రతను దృష్టిలో పెట్టుకొని చైనాకు చెందిన 58 యాప్‌లపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. అలాగే, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, ఇండోనేషియా, కిర్గిజిస్తాన్, ఆస్ట్రేలియా, రష్యా, యూకే, బెల్జియం, డెన్మార్క్, కెనడా, న్యూజిలాండ్, తైవాన్, మాల్టా, ఫ్రాన్స్, నార్వే, లాట్వియా సైతం టిక్‌టాక్‌పై నిషేధాన్ని విధించాయి.


# మయోట్‌ను వణికించిన అత్యంత శక్తిమంతమైన తుపాను..



**ఫ్రాన్స్‌లోని** హిందూ మహాసముద్ర ద్వీపసమూహమైన మయోట్‌ను అత్యంత శక్తిమంతమైన తుపాను అతలాకుతలం చేసింది. ఈ తుపాను ధాటికి వేల సంఖ్యలో ప్రజలు మరణించి ఉంటారని స్థానిక మీడియా అంచనా వేసింది. ఆగ్నేయా హిందూ మహాసముద్రంలో ఏర్పడిన చిడో తుపాను గత రాత్రి మయోట్‌ను తాకింది. ఆ సమయంలో గంటలకు 200 కిమీ (124 mph) కంటే ఎక్కువ వేగంతో గాలులు వీచాయి. ఈ గాలుల ధాటికి ఇళ్లు, ప్రభుత్వ భవనాలు, ఆసుపత్రులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ భారీ తుపాను ధాటికి భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఇప్పటి వరకూ పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. 300 మందికిపైగా గాయపడ్డారు.

అయితే, మృతుల సంఖ్య అసాధారణ రీతిలో ఉంటుందని స్థానిక అధికారులు పేర్కొంటున్నారు. వందలు, వేల సంఖ్యలో ప్రజలు మరణించి ఉంటారని ఫ్రాన్స్ అంతర్గత మంత్రిత్వ శాఖ తెలిపింది. 'బాధితులను లెక్కించడం కష్టం. మృతుల సంఖ్య కచ్చితంగా వందల్లోనే ఉంటుదని భావిస్తున్నాం. బహుశా వేలల్లో కూడా ఉండొచ్చు' అని పేర్కొంది. కాగా గత 90 ఏళ్లలో ఇంత బీభత్సమైన తుపాను చూడలేదని స్థానిక అధికారులు చెబుతున్నారు.

# రేపు లోక్‌సభ ముందుకు వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు..!




దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు సంబంధించి రూపొందించిన రెండు కీలక బిల్లులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒకే దేశంఒకే ఎన్నిక లక్ష్యంతో దేశమంతా ఒకేసారి నిర్వహించే జమిలి ఎన్నికలపై లోక్‌సభలో బిల్లులను ప్రవేశ పెట్టేందుకు కేంద్రం సిద్ధమైనట్లు తెలిసింది. రేపు లోక్‌సభలో ఈ బిల్లులను ప్రవేశ పెట్టనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తాజాగా వెల్లడించాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లు కింద జమిలి బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు తెలిపాయి. ఆ తర్వాత దీనిని చర్చ కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపనున్నారు. వాస్తవానికి రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంత చట్టాలు (సవరణ బిల్లు)ను సోమవారం సభలో ప్రవేశ పెట్టనున్నట్లు ముందుగా వార్తలు వచ్చాయి. అయితే తాజాగా రివైజ్ చేసిన లోక్‌సభ బిజినెస్ జాబితాలో వీటిని తొలగించారు. లోక్‌సభ కార్యదర్శి విడుదల చేసిన రివైజ్డ్ జాబితాలో సోమవారం ఈ రెండు బిల్లులకు సంబంధించిన అజెండాను పెట్టలేదు. దీంతో ఈ బిల్లులు నేడు సభ ముందుకు రాలేదు. మంగళవారం ఈ బిల్లులు లోక్‌షభ ముందుకు రానున్నట్లు ప్రభుత్వ వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది.

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడమే జమిలి ఎన్నికల ప్రధాన ఉద్దేశం. వాస్తవానికి మన దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కొత్తదేమీ కాదు. 1952లో తొలి సాధారణ ఎన్నికలు మొదలుకొని, 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే అనంతర కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం తదితర కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరపడం మొదలైంది.

# ప్రధాని మోదీతో శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకే భేటీ..!



శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే మూడురోజుల పర్యటన కోసం ఆదివారం భారత్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, రక్షణ, వాణిజ్యం, పెట్టుబడుల అంశంపై ప్రధాని నరేంద్ర మోదీతో సోమవారం విస్తృత చర్చలు జరిపారు. శ్రీలంక అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత దిసనాయకే తొలి విదేశ పర్యటన ఇదే. చర్చలకు ముందు ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతోనూ భేటీ అయ్యారు. ప్రధాని మోదీ, అనుర దిసానాయక్ మధ్య జరిగిన చర్చలకు సంబంధించిన వివరాలను విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరించారు. ఇరుదేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, భద్రతా సహకారంపై జరిగినట్లు తెలిపారు. విదేశాంగ మంత్రి జైశంకర్ సైతం సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. భారత్‌లో తొలిసారిగా పర్యటిస్తున్న దిసనాయకేను కలవడం ఆనందంగా ఉందన్నారు. నైబర్‌హుడ్ ఫస్ట్ విధానం, సాగర్ ఔట్‌లుక్‌కి శ్రీలంక కీలకమైందని.. ప్రధాని మోదీ, దిసనాయక మధ్య చర్చలు విశ్వాసం, సహకారాన్ని పొందిస్తాయని ఆశిస్తున్నానన్నారు. విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ జరిపిన చర్చల్లో పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన విషయాలపై చర్చించినట్లు దిసనాయకే పేర్కొన్నారు.

# ఓటర్లతో మామూలుగా ఉండదు..! లోక్‌సభ నుంచి అసెంబ్లీ వరకు ఊహించిన ఫలితాలు..!



రాజకీయంగా 2024 సంవత్సరంలో పార్టీలకు ఆశ్చర్యకరమైన ఫలితాలే వచ్చాయి. ఎన్నికల్లో ఓటర్లను తమ వైపు తిప్పుకోవడం అంత సులభం కాదని ఈ సంవత్సరంలో జరిగిన పలు ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. లోక్‌సభతో పాటు వివిధ అసెంబ్లీ ఎన్నికల వరకు రాజకీయ విశ్లేషకులు సైతం ఊహించలేని విధంగా ఓటర్లు తమ తీర్పును ఇచ్చారు. ఈ ఏడాది జరిగిన ఎన్నికలు.. ఓటర్ల తీర్పును ఓసారి గుర్తు చేసుకుందాం..!

**ఎన్డీయేకు షాక్ ఇచ్చిన లోక్‌సభ ఫలితాలు**

ఈ ఏడాది 18వ లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ఎన్నికలకు ముందు దేశంలో బీజేపీ వేవ్ ఉందని ఆ పార్టీ నేతలు తెగ ప్రచారం చేశారు. ఈ సారి 400 సీట్ల నినాదంతో బీజేపీ ముందుకెళ్లింది. పలువురు రాజకీయ పండితులు సైతం బీజేపీ రికార్డు స్థాయిలో సీట్లు సాధించగలదని.. మోదీ నేతృత్వంలోని ఎన్డీయే సీట్ల సంఖ్య తప్పనిసరిగా 400 మార్క్‌ని దాటుతుందని విశ్వసించారు. అయితే, ఫలితాలను చూసి అందరూ ఆశ్చర్యపోయారు. బీజేపీ గతంలో వచ్చిన సీట్ల సంఖ్యను సైతం అందుకోలేకపోయింది. కేవలం 240 సీట్లకు మాత్రమే పరిమితమైంది. అయితే, తెలుగుదేశం పార్టీ, జేడీయూ, ఇతర మిత్రపక్షాల సహకారంతో బీజేపీ కేంద్రంలో మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకోగలిగింది.

**ఆ విషయంలో విజయం సాధించిన కాంగ్రెస్..**

సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధాని మోదీకి తగ్గిందని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. అయితే, లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మాత్రం ప్రధాని మోదీకి ఉన్న పాపులారిటీ చెక్కుచెదరలేదని, ఇప్పటికీ ఆయన దేశంలోనే ప్రజామోదయోగ్యమైన నేత అని బీజేపీ వర్గాలు కొట్టిపడేశాయి. అయితే, సార్వత్రిక ఎన్నికల సమయంలో బీజేపీకి భారీ మెజారిటీ వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని ప్రతిపక్ష కూటమి ఆరోపించింది. ఎన్నికల ప్రచారంలో రాజ్యాంగం మార్పుపై భారీగా ప్రచారం చేసి విజయం సాధించింది. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 తొలగింపు, అయోధ్యలో రామమందిరం నిర్మాణం తదితర విప్లవాత్మక నిర్ణయాల తర్వాత బీజేపీ మెజారిటీ సంఖ్యను అందుకోలేకపోయింది. దేశంలోని హిందీ బెల్ట్ బీజేపీకి కంచుకోటగా భావిస్తుంటారు. అయితే, ఆశ్చర్యకరంగా హిందీ బెల్ట్‌లో ఉన్న అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. యూపీలో బీజేపీ కేవలం 33 సీట్లకే పరిమితమైంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ 80 సీట్లకు 62 సీట్లు కైవసం చేసుకున్న విషయం తెలిసిందే.

**మళ్లీ సంకీర్ణ రాజకీయం..**

దేశంలో సంకీర్ణ రాజకీయాలకు సుదీర్ఘ చరిత్రనే ఉన్నది. 2014, 2019 ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. ఆ తర్వాత ఇక సంకీర్ణ రాజకీయాలు ముగింపు పలికినట్లేనని.. ఓటర్లు ఏ పార్టీకి నిర్ణయాత్మకమైన మెజారిటీ ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నారని అంతా భావించారు. కానీ, 2024 ఎన్నికల్లో ఓటర్లు మరోసారి స్పష్టమైన మెజారిటీ ఇస్తారని భావించారు. కానీ, ఓ పార్టీకి సంపూర్ణ మెజారిటీ ఇవ్వలేదు. ఈ క్రమంలో మళ్లీ సంకీర్ణ రాజకీయాలు తెరపైకి వచ్చాయి. రెండుసార్లు బీజేపీ సంపూర్ణ మెజారిటీతో అధికారాన్ని కైవసం చేసుకోగా.. ఈ సారి ఎన్డీయేలోని భాగస్వామ్య పార్టీలపై ఆధారపడాల్సి వచ్చింది. అదే సమయంలో విపక్షాలు సైతం కూటమిగా ఏర్పడి ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే ప్రయత్నాన్ని ముమ్మరం చేశాయి.

**ఒడిశాలో నవీన్ పట్నాయక్ 24 ఏళ్ల పాలనకు ముగింపు..**

లోక్‌సభ ఎన్నికలతో పాటు ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఒడిశా ఎన్నికల ఫలితాలు మాత్రం ఈ సారి ప్రత్యేకంగా నిలిచాయి. నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్ పార్టీ 24 ఏళ్ల తర్వాత అధికారాన్ని కోల్పోయింది. ఒడిశాలో తొలిసారిగా బీజేపీ పార్టీ అధికారంలోకి వచ్చింది. 147 అసెంబ్లీ స్థానాలున్న ఒడిశాలో 78 స్థానాలను గెలుచుకొని అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరించింది. నవన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీ పార్టీ 51 సీట్లకు పరిమితమైంది. ఇక ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో బంపర్ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ సారి మాత్రం తుడిచిపెట్టుకుపోయింది. అలాగే, ఈ ఏడాది హర్యానా అసెంబ్లీకి సైతం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో హర్యానాలో గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ వ్యతిరేకత, రైతుల నిరసనల కారణంగా ఓటమిపాలయ్యే అవకాశం ఉందని రాజకీయ పండితులు అంచనా వేశారు. కానీ, ఆశ్చర్యకరంగా బీజేపీ ఎన్నికల్లో విజయం సాధించింది. నాయబ్ సింగ్ సైనీ ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు.

# టాప్-5 సంస్థల ఎం-క్యాప్ రూ.1.13 లక్షల కోట్లు వృద్ధి..

## భారీగా లబ్ధి పొందిన భారతీ ఎయిర్‌టెల్..!

గతవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల్లో టాప్ 10 సంస్థల్లో ఐదు సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,13,117.17 కోట్లు వృద్ధి చెందింది. భారతీ ఎయిర్‌టెల్ భారీగా లబ్ధి పొందగా, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్ఐసీ నష్టపోయాయి. గతవారం బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 623.07 పాయింట్లు, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 90.5 పాయింట్లు వృద్ధి చెందాయి.

భారతీ ఎయిర్ టెల్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.47,836.6 కోట్ల వృద్ధితో రూ.9,57,842.40 కోట్లకు చేరుకున్నది. ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.31,826.97 కోట్లు పెరిగి రూ.8,30,387.10 కోట్లకు చేరుకున్నది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ రూ.11,887.78 కోట్లు పుంజుకుని రూ.14,31,158.06 కోట్ల వద్ద స్థిర పడింది. ఐసీఐసీఐ బ్యాంకు ఎంక్యాప్ రూ.11,760.8 కోట్ల లబ్ధితో 9,49,306.37 కోట్లకు చేరింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఎంక్యాప్ రూ.9,805.02 కోట్లు పుంజుకుని రూ.16,18,587.63 కోట్లకు చేరుకున్నది. మరోవైపు, రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.52,031.98 కోట్ల పతనంతో రూ.17,23,144.70 కోట్ల వద్ద నిలిచింది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఎంక్యాప్ రూ.32,067.73 కోట్ల నష్టంతో రూ.5,89,869.29 కోట్ల వద్ద ముగిసింది. హిందూస్థాన్ యూనీ లివర్ ఎంక్యాప్ రూ.22,250.63 కోట్లు పతనమై రూ.5,61,423.08 కోట్లకు చేరుకున్నది. ఎస్బీఐ ఎంక్యాప్ రూ.2,052.66 కోట్లు, ఐటీసీ ఎంక్యాప్ రూ.1,376.19 కోట్లు కోల్పోయాయి. గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత టాప్10 సంస్థల్లో రిలయన్స్ మొదటి స్థానంలో కొనసాగుతున్నది. తర్వాతీ స్థానాల్లో టీసీఎస్, హెచ్డీఎఫ్సీ బ్యాంకు, భారతీ ఎయిర్ టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎల్ఐసీ, హిందూస్థాన్ యూనీ లివర్, ఎస్బీఐ, ఐటీసీ నిలిచాయి.

# యూపీఐపై క్రెడిట్ లైన్ ఎలా వాడుకోవాలో తెలుసా?



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. తమ తాజా ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)పై కస్టమర్లకు 'ప్రీశాంక్షన్డ్ క్రెడిట్ లైన్' సౌకర్యాన్ని కల్పించేందుకు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ అనుమతిచ్చింది. నిజానికి గత ఏడాది సెప్టెంబర్‌లోనే యూపీఐపై క్రెడిట్ లైన్ సదుపాయం మొదలైంది. అయితే ఇప్పటిదాకా షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల్లోనే ఆ సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ ఇప్పుడు చిన్నతరహా బ్యాంకులైన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ ఆర్బీఐ ఈ వీలు కల్పించింది. ఈ నిర్ణయం యూపీఐ యూజర్లకు మరింత కలిసి రానున్నది. త్వరలోనే ఇందుకు సంబంధించి స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు విధివిధానాలను ఆర్బీఐ ప్రకటించనున్నది. కాగా, అసలు ఈ యూపీఐపై 'ప్రీశాంక్షన్డ్ క్రెడిట్ లైన్' అంటే ఏమిటి? ఎలా ఈ సౌకర్యాన్ని రుణగ్రహీతలు పొందవచ్చో తెలుసుకుందాం.

### ఇదీ సంగతి..

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వివరాల ప్రకారం 'ప్రీశాంక్షన్డ్ క్రెడిట్ లైన్ ఆన్ యూపీఐ' అనేది ఆర్బీఐ విజన్‌కు అనుగుణంగా అభివృద్ధిపర్చిన ఓ సరికొత్త ఆర్థిక వెసులుబాటు. దీనిద్వారా బ్యాంకుల నుంచి వ్యక్తులు, వ్యాపారులు తక్షణ రుణాలను పొందవచ్చు. యూపీఐ ద్వారా లావాదేవీల కోసం ఈ రుణాలను వెంటనే వినియోగించుకోవచ్చు. అయితే యూపీఐ యాప్స్ ద్వారా క్రెడిట్ లైన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలనుకుంటే ముందు గా మీకు సేవింగ్స్ ఖాతా (యూపీఐ యాప్స్‌కు లింకై ఉన్న సేవింగ్స్ అకౌంట్) గల బ్యాంక్ నుంచి ఆమోదం పొందాలి. ఇందుకోసం ఓ అప్లికేషన్‌ను బ్యాంక్‌లో సమర్పించాలి. అప్పుడు బ్యాంక్ మీ అర్హత, ఆదాయం, క్రెడిట్ స్కోర్, రుణ చరిత్రను పరిశీలిస్తుంది. ఈ క్రమంలో ఆదాయం, గుర్తింపు, చిరునామా, ఇతరత్రా అవసరమైన డాక్యుమెంట్లను బ్యాంక్‌కు సమర్పించాల్సి ఉంటుంది. అన్నింటినీ పరిశీలించిన తర్వాత బ్యాంక్ ఆమోదిస్తే మీకు క్రెడిట్ లైన్ సౌకర్యం లభిస్తుంది. అవసరం ఉన్నప్పుడు దీన్ని ఉపయోగించుకోవచ్చు.

### ఎలా లింక్ చేసుకోవాలి?

ఎన్‌పీసీఐ వెబ్‌సైట్ ప్రకారం తొలుత గూగుల్ ప్లే స్టోర్ నుంచి యూపీఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఒకవేళ మీ స్మార్ట్‌ఫోన్‌లో ఇప్పటికే ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం తదితర యూపీఐ యాప్‌లు ఉన్నట్టైతే మళ్లీ ఏ డౌన్‌లోడ్‌లూ అవసరం లేదు. ఉదాహరణకు ఫోన్‌పేలోకి లాగిన్ అయిన తర్వాత పైన కుడివైపు చివర్లో కనిపించే రౌండ్ బాక్స్‌లో ఉన్న కొశ్చన్ మార్క్‌పై క్లిక్‌చేస్తే ఓ కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. అందులో ప్రొఫైల్ అండ్ పేమెంట్స్ ఆప్షన్ ఉంటుంది. దానిపై క్లిక్‌చేసి పేమెంట్స్ మెథడ్స్‌ను ఎంచుకోవాలి. అందులో మీకు యూపీఐ క్రెడిట్ లైన్ ఆప్షన్ ఉంటుంది. దాన్ని ఎంచుకొంటే మీకు క్రెడిట్ లైన్ సౌకర్యాన్ని కల్పించిన బ్యాంక్ కనిపిస్తుంది. దానిపై క్లిక్‌చేసి పిన్ నెంబర్ ద్వారా పేమెంట్స్‌ను పూర్తి చేయవచ్చు. అలాగే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఫోన్‌పే తదితర యాప్‌ల ద్వారా కూడా బైనౌపే లేటర్ సదుపాయాలు లభిస్తున్నాయి.

**గుర్తుంచుకోండి..**

**ఈ క్రెడిట్ లైన్ రీపేమెంట్స్.. బ్యాంకునుబట్టి ఒక్కో రకంగా ఉంటాయి. అలాగే మీ ఖాతాలో నగదు నిల్వలు లేకపోయినా రుణం ద్వారా మీ అవసరాలను యూపీఐ పేమెంట్స్‌తో చేసుకుంటున్నందున దీనికి వడ్డీరేట్లు కూడా ఎక్కువే ఉంటాయి. ఇక అప్రమత్తంగా లేకపోతే సైబర్ మోసాలకూ తావుంటుంది.**

## మార్కెట్‌లో ప్రతికూల పవనాలు..
# నష్టాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లోకి ముగిశాయి. ప్రపంచ మార్కెట్లలో ప్రతికూల పవనాల నేపథ్యంలో మార్కెట్లు ప్రారంభంలోనే నష్టాల్లో మొదలయ్యా. ఈ వారంలో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ పాలసీ రేట్‌ని ప్రకటించనున్నది. ఈ క్రమంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. ఉదయం సెన్సెక్స్ క్రితం సెషన్‌తో పోలిస్తే 82,000.31 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 82,116.44 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. 81,551.28 పాయింట్ల కనిష్ఠాన్ని తాకింది. చివరకు 384.55 పాయింట్లు పతనమై.. 81,748.57 వద్ద ముగిసింది. నిఫ్టీ 100.05 పాయింట్లు పతనమై.. 24,668.25 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,220 షేర్లు పురోగమించగా.. 1748 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో టైటాన్ కంపెనీ, టీసీఎస్, హిందాల్కో ఇండస్ట్రీస్, అదానీ పోర్ట్స్, బీపీసీఎల్ టాప్ లూజర్స్‌గా నిలిచాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, పవర్ గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.5 శాతం చొప్పున పెరిగాయి. సెక్టార్లలో, రియల్టీ ఇండెక్స్ 3శాతం, మీడియా ఇండెక్స్ 1.5 శాతం, పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 0.5 శాతం లాభపడ్డాయి. ఐటీ, మెటల్, ఆయిల్, గ్యాస్ 0.5 నుంచి ఒకశాతం వరకు పతనమయ్యాయి.

# బ్యాంకుల ఉద్యోగులకు వారానికి 5 రోజుల పని.. ఎప్పుడు అమల్లోకి వస్తుంది?



భారతదేశంలోని బ్యాంకులకు 5 రోజులు పని చేయడంపై చర్చ మళ్లీ ప్రారంభమైంది. 5 రోజుల పని అమలుపై చర్చ మళ్లీ ఊపందుకుంది. ప్రస్తుతం బ్యాంకులు వారానికి ఆరు రోజులు పనిచేస్తుండగా, రెండో, నాలుగో శనివారాల్లో సెలవులు ఉంటాయి. బ్యాంకు ఉద్యోగులకు 5 రోజులు పని చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. అయితే దీనిని డిసెంబర్ 2024 లో అమలు చేయాలని భావిస్తున్నప్పటికీ, ఈ ప్రతిపాదన ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం వేచి ఉంది.

### ప్రతిపాదన ఏమిటి?

బ్యాంకుల అతిపెద్ద సంస్థ అయిన ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (IBA), యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (UFBU) అనేక సార్లు 5 రోజుల పనిని ప్రతిపాదించాయి. గ్లోబల్ బ్యాంకింగ్ నిబంధనల ప్రకారం.. పనితీరును రూపొందించడం, ఉద్యోగుల శ్రేయస్సును మెరుగుపరచడం, ఉత్పాదకతను మెరుగుపరచడం ఈ పథకం లక్ష్యం. డిసెంబరు 2023లో IBA, బ్యాంక్ యూనియన్‌ల మధ్య అవగాహన ఒప్పందం (MOU) సంతకం చేశాయి. ఇందులో 5 రోజుల పని కోసం ప్రతిపాదన కూడా ఉంది. దీని తర్వాత, 8 మార్చి 2024న, ఐబీఏ, ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ (AIBOC) 9వ ఉమ్మడి నోట్‌పై సంతకం చేశాయి. ఈ నోట్‌లో శని, ఆదివారం సెలవులతో 5 రోజుల పనిని అమలు చేయడానికి బ్లూప్రింట్ సమర్పించారు.

### వినియోగదారులపై ప్రభావం

ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చినట్లయితే, బ్యాంకు శాఖలను సందర్శించేందుకు కస్టమర్లు ముందుగానే తమ ప్రణాళికలను మెరుగుపరుచుకోవాలి. ముఖ్యంగా డిజిటల్ బ్యాంకింగ్ వినియోగం పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో కస్టమర్లు సమస్యలను ఎదుర్కోవచ్చు. అయితే, 5 రోజులు పని చేయడం వల్ల కస్టమర్ సర్వీస్ అవర్స్‌పై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని బ్యాంకు యూనియన్లు హామీ ఇచ్చాయి. ఇందుకోసం బ్యాంకు శాఖల సమయాన్ని దాదాపు 40 నిమిషాలు పెంచడంతోపాటు డిజిటల్ సేవలను బలోపేతం చేయనున్నారు.



## ఖోఖో ప్రపంచకప్‌లో
# అమెరికా




**న్యూఢిల్లీ:** భారత్ వేదికగా తొలిసారి జరుగనున్న ఖో ఖో ప్రపంచకప్‌లో ప్రాతినిధ్యం అంతకంతకూ పెరుగుతున్నది. గ్రామీణ క్రీడగా పేరొందిన ఖో ఖో మెగాటోర్నీలో ఆడేందుకు అమెరికా, ఇంగ్లండ్, జర్మనీ, ఆస్ట్రేలియా, బ్రెజిల్, న్యూజిలాండ్ తమ సంసిద్ధత తెలియజేశాయి. జనవరి 13నుంచి 19వ తేదీ వరకు జరుగనున్న ప్రపంచకప్‌లో 24 జట్లు పోటీపడనున్నాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో టోర్నీ జరుగుతుందని జాతీయ ఖో ఖో ఫెడరేషన్ అధ్యక్షుడు సుదాంశు మిట్టల్ పేర్కొన్నాడు.



# యువ భారత్ బోణీ

## పాకిస్థాన్‌పై ఘన విజయం

**కౌలాలంపూర్:** అరంగేట్రం ఆసియా అండర్19 మహిళల టీ20 ఆసియాకప్‌లో యువ భారత్ అదిరిపోయే బోణీ కొట్టింది. ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. పాక్ నిర్దేశించిన 68 పరుగుల లక్ష్యాన్ని టీమ్‌ఇండియా ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. యువ ఓపెనర్ గొంగడి త్రిష(0) పరుగుల ఖాతా తెరువకుండానే నిష్క్రమించగా, కమిలిని(44 నాటౌట్), సనికా చాల్కె(19 నాటౌట్) జట్టును గెలుపు తీరాలకు చేర్చారు. పాక్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ కమిలిని తన ఇన్నింగ్స్‌లో 4ఫోర్లు, 3సిక్స్‌లతో విజృంభించింది. తొలుత పాక్ 20 ఓవర్లలో 67/7 స్కోరు చేసింది. ఓపెనర్ కోమల్‌ఖాన్(24) టాప్‌స్కోరర్‌గా నిలువగా, మిగతావారు విఫలమయ్యారు. సోనమ్‌యాదవ్(4/6) పాక్ పతనంలో కీలకమైంది. కమిలినికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

# కేకేఆర్ అదృష్టాన్ని మార్చిన గౌతమ్ గంభీర్.. ఫలించిన పదేళ్ల నిరీక్షణ..!



టీమిండియాతో పాటు ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్‌కు 2024 సంవత్సరం చాలా ప్రత్యేకంగా నిలిచింది. శ్రేయాస్ అయ్యర్ నాయకత్వంలోని జట్టు మూడోసారి ఐపీఎల్ టైటిల్‌ని నెగ్గింది. దాదాపు పది సంవత్సరాల తర్వాత మరోసారి కప్‌ని సాధించింది. ఫైనల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై కేకేఆర్ జట్టు ఘన విజయం సాధించింది. కేకేఆర్ టైటిల్‌ని నెగ్గడంలో మెంటార్ గౌతమ్ గంభీర్ సైతం కీలక పాత్ర పోషించాడు. కేకేఆర్ చివరిసారిగా 2014లో విజేతగా నిలువగా.. మళ్లీ కప్ గెలిచేందుకు పదేళ్లు పట్టింది.

### గంభీర్ కెప్టెన్సీలోనే రెండు టైటిల్స్..

కోల్‌కతా నైట్‌రైడ్స్ ఇప్పటి వరకు మూడుసార్లు ఐపీఎల్ టైటిల్‌ను నెగ్గింది. ఈ ఏడాదితో పాటు 2012, 2014లో ట్రోఫీని గెలిచింది. ఆ సమయంలో కేకేర్ జట్టు కెప్టెన్‌గా గౌతమ్ గంభీర్ ఉన్నాడు. గంభీర్ రిటైర్‌మెంట్ అనంతరం కేకేఆర్ టైటిల్‌ను గెలిచేందుకు చాలాకాలమే నిరీక్షించాల్సి వచ్చింది. కానీ, ఈ సీజన్‌లో కోల్‌కతా మెంటార్‌గా మారడంతో చాంఫియన్‌గా అవతరించింది. కోల్‌కతా జట్టు 2021 సీజన్‌లో ఫైనల్‌కు చేరినా.. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు చేతిలో ఓటమిపాలైంది.

### కేకేఆర్‌కు అదృష్టంగా గంభీర్

బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ యాజమాన్యంలోని కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్రారంభం నుంచే లీగ్‌లో ఉన్నది. తొలిసారిగా టైటిల్‌ను నెగ్గేందుకు నాలుగేళ్ల సమయం పట్టింది. 2011 సీజన్‌లో వేలంలో గంభీర్‌ను తీసుకొని కెప్టెన్‌గా బాధ్యతలు అప్పగించింది. ఆ సీజన్‌లో కేకేఆర్‌లో చాలామంది ఆటగాళ్లు మారిపోయారు. గంభీర్ ఆ తర్వాత తనకు ఇష్టమైన రీతిలో టీమ్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఆ జట్టు తొలిసారిగా ప్లే ఆఫ్‌కు చేరుకుంది. ఆ సీజన్‌లో కేకేఆర్ నాలుగో స్థానంలో నిలిచింది. 2012 సీజన్‌లో మరోసారి గంభీర్ నాయకత్వంలో జట్టు వచ్చింది. ఆ సీజన్‌లో గంభీర్ బ్యాట్‌తో రాణించాడు. ఈ క్రమంలో జట్టు తొలిసారిగా ఫైనల్స్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. టైటిల్ మ్యాచ్‌లో కోల్‌కతా వరుసగా రెండు సీజన్లలో చెన్నై సూపర్ కింగ్స్ (CSK)తో తలపడింది. ధోనీ నేతృత్వంలోని సీఎస్‌కే నుంచి కోల్‌కతాకు గట్టి పోటీ ఎదురైంది. చెన్నై హోమ్‌గ్రౌండ్ చెపాక్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో కేకేఆర్‌కు 191 పరుగుల లక్ష్యాన్ని చెన్నై నిర్దేశించింది. కోల్‌కతా మరో రెండు బంతులు మిగిలి ఉండగానే ఐదు వికెట్ల కోల్పోయి మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. ఇలా గంభీర్ కెప్టెన్సీలో కేకేఆర్ తొలిసారి టైటిల్ గెలుచుకుంది. ఆ తర్వాత 2014 సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి రెండోసారి టైటిల్‌ను ఎగరేసుకొని పోయింది. ఆ సమయంలో జట్టు మెంటార్‌గా చేరి.. తొలి సీజన్‌లోనే కేకేఆర్‌కు మరో విజయాన్ని అందించాడు.

### కేకేఆర్ టూ టీమిండియా కోచ్..

**ఐపీఎల్ 2024 సీజన్ టైటిల్‌ను కేకేఆర్ నెగ్గడంతో గంభీర్‌ను భారత జట్టు హెడ్ కోచ్ డిమాండ్ ఊపందుకున్నది. ఐపీఎల్ తర్వాత టీ20 ప్రపంచకప్ అమెరికా, వెస్టిండీస్ వేదికగా నిర్వహించిన విషయం తెలిసిందే. టీ20 వరల్డ్ కప్‌ను టీమిండియా నెగ్గింది. వరల్డ్ కప్‌తో అప్పటి భారత జట్టు హెడ్‌కోచ్ ద్రవిడ్ పదవీకాలం ముగిసింది. ఆ తర్వాత భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (BCCI) ద్రవిడ్ స్థానంలో భారత జట్టు బాధ్యతలను గంభీర్‌కు అప్పగించింది. భారత జట్టుకు కోచ్‌గా మారడంతో కేకేఆర్‌తో గంభీర్ బంధానికి మళ్లీ బ్రేక్‌పడింది. టీమిండియా కోచ్‌గా మారడంతో కేకేఆర్ మెంటార్ పదవిని వదులుకోవాల్సి వచ్చింది.**

# ముంబైదే ముస్తాక్ అలీ

## ఫైనల్లో మధ్యప్రదేశ్‌పై ఘన విజయం



**బెంగళూరు:** సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో ముంబై విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ముంబై 5 వికెట్ల తేడాతో మధ్యప్రదేశ్‌పై అద్భుత విజయం సాధించింది. ఎంపీ నిర్దేశించిన 175 పరుగుల లక్ష్యఛేదనలో ముంబై 17.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. 47 పరుగులకే పృథ్విషా(10), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(16) వికెట్లు కోల్పోయిన ముంబైని సీనియర్లు సూర్యకుమార్‌యాదవ్(48), రహానే(37) ఆదుకున్నారు. వీరిద్దరు కలిసి మూడో వికెట్‌కు 52 పరుగులు జతచేశారు. అయితే 14.4 ఓవర్లలో ముంబై 129 పరుగులకు 5 వికెట్లు కోల్పోయింది. ఈ తరుణంలో సూర్యాంశ్ శెడ్గె(15 బంతుల్లో 36 నాటౌట్), అథర్వ(16 నాటౌట్) చెలరేగడంతో ముంబై గెలుపు వాకిట నిలిచింది. త్రిపురేశ్‌సింగ్(2/34) రెండు వికెట్లు తీశాడు. తొలుత కెప్టెన్ రజత్ పాటిదార్(40 బంతుల్లో 81 నాటౌట్, 6ఫోర్లు, 6సిక్స్‌లు) అజేయ అర్ధసెంచరీతో ఎంపీ 20 ఓవర్లలో 174/8 స్కోరు చేసింది. పాటిదార్ మినహా ఎవరూ పెద్దగా రాణించలేకపోయారు. శార్దుల్, రోస్టన్ రెండేసి వికెట్లు తీశారు. సూర్యాంశ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', రహానే 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' దక్కింది.



## చాంపియన్ ట్రోఫీతో స్వదేశంలో
# అడుగుపెట్టిన గుకేశ్

ప్రపంచ చెస్ చాంపియన్‌గా 18 ఏళ్ల గుకేశ్ అవతరించిన విషయం తెలిసిందే. సింగపూర్‌లో జరిగిన ఫిడే వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్‌లో చైనా క్రీడాకారుడు డింగ్ లిరెన్‌ను ఓడించి అతను విశ్వ విజేతగా నిలిచాడు. ఆ టైటిల్‌ను అందుకున్న అతిపిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. ఈ నేపథ్యంలో గుకేశ్ తాజాగా స్వదేశానికి చేరుకున్నారు. ఇవాళ ఉదయం తమిళనాడు రాజధాని చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయ్యారు. ఈ సందర్భంగా గుకేశ్‌కు ఘన స్వాగతం లభించింది. పాఠశాల విద్యార్థులు, అధికారులు గుకేశ్‌ను ఘనంగా స్వాగతించారు. భారత జెండాలు ప్రదర్శిస్తూ పూల వర్షంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గుకేశ్ మాట్లాడుతూ.. తనకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

08 మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | మంగళవారం, హైదరాబాద్ | 17-12-2024
ANN తెలుగు

# అట్లీ లుక్‌పై కామెంట్స్..

## బాలీవుడ్ కామెడియన్‌ను తిట్టిపోస్తున్న నెటిజన్లు





తమిళ దర్శకుడు అట్లీపై బాలీవుడ్ స్టార్ కామెడియన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వివాదాస్పదంగా మారాయి. తమిళ దర్శకుడు అట్లీ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. రాజా రాణి సినిమాతో హిట్ అందుకొని తేరి, మెర్సల్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. రీసెంట్ బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్‌తో జవాన్‌తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు. అయితే ఆయన నిర్మాణంలో వస్తున్న తాజా చిత్రం బేబి జాన్. విజయ్ తేరి సినిమాకు రీమేక్‌గా వస్తున్న ఈ సినిమాలో వరుణ్ ధావన్ కథానాయకుడిగా నటిస్తుండగా.. కీర్తి సురేష్, వామిక గబ్బి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది.

అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా.. కపిల్ శర్మ కామెడీ షోకి హాజరైన ఈ చిత్రబృందానికి ఒక చేదు అనుభవం ఎదురైంది. ఈ షోలో భాగంగా.. కపిల్ శర్మ అట్లీని అడుగుతూ.. "మీరు కథ చెప్పడానికి ఏ స్టార్ హీరో దగ్గరికైన వెళ్లినప్పుడు వాళ్లు అట్లీ ఎక్కడున్నారు అని అడిగారా" అంటూ కపిల్ ప్రశ్నించాడు. అయితే కపిల్ మాటల్లోని ఉద్దేశం అర్థం చేసుకున్న అట్లీ తనదైన శైలీలో గట్టిగా సమాధానమిచ్చాడు. "ఇలాంటి ప్రశ్న నన్ను ఎందుకు అడుగుతున్నారో నాకు అర్థమైంది. ఈ ప్రశ్నకు నా ఆన్సర్ ఒక్కటే. మనకు టాలెంట్ ఉన్నప్పుడు మనం ఎలా ఉన్నాము అనేది పెద్ద విషయం కాదు. నేను ఈ విషయంలో ముందుగా దర్శకుడు ఏఆర్ మురుగదాస్‌కి ధన్యవాదాలు చెప్పాలి. నా దర్శకత్వంలో వచ్చిన రాజా రాణి సినిమాను నిర్మించింది ఆయనే. అతడు నన్ను నమ్మాడు కాబట్టే ఇలా ఉన్నాను. అయితే రాజా రాణి కథతో మురుగదాస్ దగ్గరికి వెళ్లినప్పుడు అతడు నా కథను మాత్రమే చూశాడు తప్ప నా లుక్ ఎలా ఉంది అనేది చూడలేదు. కాబట్టి.. ప్రపంచం కూడా మన పనినే చూడాలి తప్ప.. మన లుక్‌ని బట్టి మనల్ని అంచనా వేయకూడదు". అంటూ అట్లీ చెప్పుకొచ్చాడు. అయితే కపిల్ శర్మ అట్లీ లుక్స్‌పై కామెంట్ చేయడంతో అతడి తీరుపై నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు. కాగా ఈ వీడియోను మీరు కూడా చూసేయండి.

# త్వరలోనే బాధిత కుటుంబాన్ని కలుస్తా : అల్లు అర్జున్



ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఆమె కుమారుడు శ్రీతేజ్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను తాను కలవలేక పోతున్నానంటూ అల్లు అర్జున్ తాజాగా తెలిపారు. బాలుడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. 'దురదృష్టకర సంఘటన తర్వాత వైద్య సంరక్షణలో ఉన్న శ్రీతేజ్ గురించి నేను ఆందోళన చెందుతున్నాను. బాలుడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా. ప్రస్తుతం కొనసాగుతున్న న్యాయపరమైన విచారణ కారణంగా.. ఈ సమయంలో శ్రీతేజ్‌ను, అతడి కుటుంబాన్ని కలవలేకపోతున్నాను. త్వరలోనే వారి కుటుంబాన్ని కలిసి మాట్లాడతాను. వైద్యపరంగా, కుటుంబ పరంగా వారిని ఆదుకుంటానని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాను' అని అల్లు అర్జున్ ట్వీట్ చేశారు. కాగా, సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్‌ను ఈనెల 13న చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అనంతరం శనివారం ఉదయం బెయిల్‌పై ఆయన్ని విడుదల చేశారు.

# భాషలకు అతీతంగా



తన నట ప్రయాణాన్ని భాషలకు అతీతంగా సాగిస్తున్నారు తారక్. ప్రస్తుతం ఆయన హృతిక్ రోషన్‌తో కలిసి బాలీవుడ్‌లో 'వార్ 2' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ నిమిత్తం ఆయన ముంబైలోనే ఉన్నారు. అక్కడ తారక్‌పై దర్శకుడు అయాన్ ముఖర్జీ భారీ యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగస్టులో ఈ సినిమాను విడుదల చేయనున్నట్టు యష్‌రాజ్ ఫిల్మ్స్ అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమా తర్వాత కన్నడ దర్శకుడు ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో నటిస్తారు తారక్. మరో వైపు తారక్ కోసం తమిళ దర్శకులు అట్లీ, వెట్రిమారన్ కథలు వండే పనిలో ఉన్నారు. వారితో కూడా తారక్ సినిమాలు చేయనున్నట్టు కోలీవుడ్ సమాచారం. ప్రస్తుతం తారక్ చేయబోయే సినిమాలన్నీ పరభాషా దర్శకులతోనే కావడం విశేషం. తెలుగు దర్శకుడు సందీప్‌రెడ్డి వంగాతో కూడా ఓ సినిమా ఉంటుందని తెలుస్తున్నది. కాకపోతే ఆ ప్రాజెక్ట్‌కు రెండుమూడేళ్లు పట్టడం ఖాయం. ఆర్ఆర్ఆర్, దేవర చిత్రాల తర్వాత మారిన ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకొని పాన్ ఇండియా రేంజ్ కథలను ఎంచుకుంటూ, అందుకు తగ్గ దర్శకులను ఎన్నుకుంటూ ఓ ప్లాన్ ప్రకారం ముందు కెళ్తున్నారు తారక్.



# సతీ లీలావతి

లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో, తాతినేని సత్య దర్శకత్వంలో, నాగమోహన్‌బాబు.ఎం, రాజేష్.టి నిర్మిస్తున్న చిత్రానికి 'సతీ లీలావతి' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఆదివారం లావణ్య త్రిపాఠి పుట్టిన రోజు సందర్భంగా ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ.. టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'సతీలీలావతిగా డిఫరెంట్‌రోల్‌లో లావణ్య కనిపించనున్నారు. ఉత్సుకతను కలిగించే కథాంశంతో ఈ సినిమా రూపొందనుంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం. మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తాం' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి మాట లు: ఉదయ్ పొట్టిపాడు, కెమెరా: బినేంద్ర మీనన్, సంగీతం: మిక్కీ జె.మేయర్, నిర్మా ణం: దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్

# ప్రశంసల ప్రణయ గోదారి



సదన్, ప్రియాంక ప్రసాద్ జంటగా రూపొందిన ప్రేమకథ 'ప్రణయగోదారి'. పి.ఎల్. విఘ్నేష్ దర్శకుడు. పారమళ్ల లింగయ్య నిర్మాత. ఇటీవలే సినిమా విడుదలైంది. ఈ సినిమా సక్సెస్‌మీట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. సినిమా చూసినవారంతా అభినందిస్తున్నారనీ, ఇంతటి విజయాన్నిచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలని దర్శకుడు విఘ్నేష్ చెప్పారు. తన పాత్రను అందరూ ప్రశంసిస్తున్నారని, ఇంతటి మంచి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్సని కథానాయిక ప్రియాంక ప్రసాద్ అన్నారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.

# దేవర ఆయుధ పూజ పాటకి స్టెప్పులేసిన రాజమౌళి..



ఆస్కార్ అవార్డు విజేత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్. కీరవాణి ఇంట్లో పెళ్లి బాజాలు మోగిన విషయం తెలిసిందే. ఆయన చిన్న కుమారుడు మత్తు వదలరా ఫేం శ్రీ సింహా తాజాగా పెళ్లి బంధంలోకి అడుగుపెట్టాడు. సీనియర్ నటుడు మురళీ మోహన్ మనవరాలు రాగ మాగంటిని శ్రీసింహ వివాహం చేసుకున్నాడు. అయితే వీరి పెళ్లిలో రాజమౌళి దంపతులు అమ్మా నాన్న ఓ తమిళ అమ్మాయి సినిమాలోని 'లంచ్ కొస్తావా మంచె కొస్తావా' పాటకు స్టెప్పులేసిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియో ఇప్పటికే వైరల్‌గా మారింది. అయితే పెళ్లి అనంతరం శ్రీ సింహ బారాత్ జరుగగా.. ఈ వేడుకలో రాజమౌళి మళ్లీ తన డాన్స్‌తో అలరించాడు. ఎన్టీఆర్ నటించిన దేవర సినిమాలోని ఆయుధ పూజ పాటకి కీరవాణి పెద్ద కొడుకు కాలా భైరవతో కలిసి స్టెప్పులేశాడు. కాగా ఈ వీడియోను మీరు చూసేయండి.



క్రైస్తవ పద్ధతిలో కీర్తి సురేష్ వివాహం

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com